




# నిజం చెప్తుతాం

Nijam Cheputham


తెలుగు దినపత్రిక









సూర్యాపేట | బుధవారం | 15-07-2026 | ఎడిటర్: కామళ్ల కాంతయ్య | సంపుటి: 5 | సంచిక:320 | పేజీలు: 4 | వెల: రూ.1/-

## బ్యాంకులకు ఆర్బీఐ కీలక సూచన

- ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల సీఈవోలతో ఆర్బీఐ గవర్నర్ సమావేశం

**న్యూఢిల్లీ,జూలై14,(నిజం చెప్తుతాం)** బ్యాంకింగ్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగాన్ని పెంచాలని, సైబర్ భద్రతను పటిష్ఠం చేసుకోవాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా బ్యాంకులకు పిలుపునిచ్చారు. వినియోగదారులకే పెద్దపీట వేయాలని అన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, భారత బ్యాంకింగ్ రంగం అన్ని విభాగాల్లోనూ విస్తృతమైన వృద్ధిని సాధించిందని ప్రశంసించారు.



## అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదు

రాజకీయాలు కేవలం ఎన్నికల సమయానికే పరిమితం కావాలి: సీఎం రేవంత్ రెడ్డి

- వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌లను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని వినతి
- 2028 జూన్ 2 నాటికి వరంగల్ విమానాశ్రయం సిద్ధం చేయాలని కోరిన ముఖ్యమంత్రి
- కాకతీయ సంస్కృతి ఉట్టిపడేలా వరంగల్ ఎయిర్‌పోర్ట్ డిజైన్ ఉండాలని సూచన

**హైదరాబాద్,జూలై14,(నిజం చెప్తుతాం)** అభివృద్ధిని రాజకీయాలతో ముడిపెట్టకూడదని, రాజకీయాలు కేవలం ఎన్నికల సమయానికే పరిమితం కావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏర్పాటుచేయనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు వరంగల్ కేంద్రంగా ఉంటుందని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌తో పాటు ఇతర పరిశ్రమల రాకతో నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నందున విమానాశ్రయం ఎంతో కీలకమని ముఖ్యమంత్రి... కేంద్రమంత్రికి వివరించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయినందున వెంటనే టెండర్లు పిలిచి, 2028 జూన్ 2 నాటికి పనులన్నీ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధీనంలోని ఎయిర్‌పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయాన్ని కూడా నిర్మించాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణా సంస్థలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు సీప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని కోరగా, దీనిపై తగిన ప్రతిపాదనలు అందజేయాలని కేంద్రమంత్రి సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రం చేయనంత వేగంగా తెలంగాణ ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు.

## ఉక్రెయిన్‌పై అణుదాడిని ఆపిన మోదీ

- ఉక్రెయిన్‌పై అణుదాడిని ప్రధాని మోదీ నివారించారన్న పోలండ్ మంత్రి
- రష్యాతో భారత్‌కు ఉన్న సంబంధాలే ఇందుకు కారణమని వ్యాఖ్య



**న్యూఢిల్లీ,జూలై14,(నిజం చెప్తుతాం)** ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో అణ్వస్త్రాల ప్రయోగం జరగకుండా నివారించడంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ కీలక పాత్ర పోషించారని పోలండ్ డిప్యూటీ విదేశాంగ మంత్రి వ్లాడిస్లావ్ టియోఫిల్ బార్టోస్జెస్కీ ప్రశంసించారు. 2022 చివరి నాటికి ఉక్రెయిన్‌పై అణుదాడికి రష్యా సిద్ధమవుతోందన్న ఆందోళనలు వ్యక్తమైన తరుణంలో, ప్రధాని మోదీ జోక్యం చేసుకుని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఒప్పించగలిగారని ఆయన వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "ప్రధాని మోదీ అంతర్జాతీయ స్థాయిలో విశేష గౌరవం పొందిన గొప్ప రాజనీతిజ్ఞుడు. భారత్‌కు రష్యాతో చారిత్రక, సుదీర్ఘ సంబంధాలు ఉన్నాయి.

## యూపీలోని భారత్-నేపాల్ సరిహద్దులో అమెరికా పౌరుడు అరెస్ట్

- ఎలాంటి పత్రాలు లేకుండా నేపాల్‌లోకి అక్రమంగా వెళ్లేందుకు ప్రయత్నం
- థాయ్‌లాండ్‌లో పాస్‌పోర్ట్ పోయిందని, శ్రీలంక నుంచి భారత్ వచ్చానని వెల్లడి



**న్యూఢిల్లీ,జూలై14,(నిజం చెప్తుతాం)** ఓ అమెరికా పౌరుడిని భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని మహరాజ్‌గంజ్ జిల్లా సోనౌలీ సరిహద్దు వద్ద జులై 11న ఈ ఘటన చోటుచేసుకుంది. కాలిఫోర్నియాకు చెందిన జోర్డాన్ బ్రౌన్ (36) అనే వ్యక్తిని సశస్త్ర సీమా బల్ సిబ్బంది అరెస్ట్ చేశారు. అతడిని విచారించగా, అతని వద్ద పాస్‌పోర్ట్, వీసా వంటి ఎటువంటి గుర్తింపు పత్రాలు లేవని తేలింది. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా భారత్‌కు చేరుకుని, ఇక్కడి నుంచి నేపాల్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నించిన



## అమర్‌నాథ్ యాత్ర

- 11 రోజుల్లో 2.75 లక్షల మందికి పైగా అమర్‌నాథ్ దర్శనం
- జమ్మూ నుంచి మరో 5,335 మంది భక్తుల బ్యాచ్ పయనం

**ఇంటర్నెట్ న్యూస్,జూలై14** అమర్‌నాథ్ యాత్ర-2026 అత్యంత భక్తిశ్రద్ధలతో, విజయవంతంగా కొనసాగుతోంది. యాత్ర ప్రారంభమైన తొలి 11 రోజుల్లోనే 2.75 లక్షల మందికి పైగా భక్తులు పవిత్ర గుహలోని హిమలింగాన్ని దర్శించుకున్నారని అధికారులు వెల్లడించారు. యాత్రికుల తాకిడి రోజురోజుకు క్రమంగా పెరుగుతోంది. మంగళవారం జమ్మూ నుంచి 5,335 మంది భక్తులతో కూడిన మరో బృందం కట్టుదిట్టమైన భద్రత మధ్య బయలుదేరింది.



## మీనాక్షి నటరాజన్‌కు కడియం శ్రీహరిపై కొండా సురేఖ ఫిర్యాదు

- శ్రీహరి తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారన్న సురేఖ
- సంయమనం పాటించాలన్న మీనాక్షి నటరాజన్

**హైదరాబాద్,జూలై14,(నిజం చెప్తుతాం)** తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీ హరి మధ్య నెలకొన్న వివాదం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ వద్దకు చేరింది. మీనాక్షి నటరాజన్‌తో మంత్రి కొండా సురేఖ భేటీ అయి కడియం శ్రీహరిపై ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీ సేలా వ్యవహరిస్తున్నారని, అనవసర వివాదా ల్లోకి లాగుతున్నారని మీనాక్షి దృష్టికి తీసుకెళ్లారు.

## అధికారులు నాలుగు గోడలకే పరిమితం కావొద్దు

- మంత్రులు, కార్యదర్శులతో సీఎం చంద్రబాబు సమావేశం
- సమస్య రాకముందే పసిగట్టాలి.. అదే సమర్థత అన్న చంద్రబాబు



**అమరావతి,జూలై14,(నిజం చెప్తుతాం)** "సమస్య వచ్చిన తర్వాత పరిష్కరించేవాడు మంచి అధికారి అయితే, అసలు సమస్యే తలెత్తకుండా ముందుచూపుతో పనిచేసేవాడు అద్భుతమైన అధికారి. ఆ కోణంలో అధికారులు పని చేయాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతాధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి వాస్తవాలు తెలియాలంటే అధికారులు నాలుగు గోడలు దాటి ప్రజల్లోకి వెళ్లాలిందేనని, వినూత్న ఆలోచనలతోనే సుపరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లగలమని హితవు పలికారు. మంగళవారం సచివాలయంలో మంత్రులు, ప్రభుత్వ కార్యదర్శులు, విభాగాధిపతులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో సీఎం మాట్లాడారు. డేటా డ్రివెన్ గవర్నెన్స్‌తో రియల్ టైమ్ ఫలితాలు సాధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.


## సింగరేణికి పట్టిన శని ఆ రెండు పార్టీలే

- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు సింగరేణిని దోచుకుతిన్నాయన్న కిషన్ రెడ్డి
- సింగరేణిని అప్పుల ఊబిలోకి నెట్టేశారని ఆరోపణ
- సింగరేణిని కాపాడుకోవడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి

**హైదరాబాద్,జూలై14,(నిజం చెప్తుతాం)** తెలంగాణకు గుండెచప్పుడు లాంటి సింగరేణి సంస్థను గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు కలిసి నిలువునా ముంచేశాయని కేంద్ర బొగ్గగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. కేసీఆర్ కుటుంబం, కాంగ్రెస్ పాలకులు పోటీపడి మరీ సింగరేణిని తమ సొంత ఖజానాలా వాడుకున్నారని మండిపడ్డారు. కార్మికుల చెమట వాసన తెలిసిన సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టి, ఇప్పుడు దాని భవిష్యత్తును పూర్తిగా అంధకారంలోకి నెట్టేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సింగరేణి నుంచి బొగ్గు కొనుగోలు చేసి, విద్యుత్ వాడుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ సంస్థకు చెల్లించాల్సిన బకాయిలను తుంగలో తొక్కిందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం సుమారు రూ. 30 వేల కోట్ల బకాయిలు పెట్టిపోతే, ప్రస్తుత కాంగ్రెస్



ప్రభుత్వం దానికి మరో రూ. 24 వేల కోట్లు జోడించిందని మండిపడ్డారు. ఇలా మొత్తం రూ. 54 వేల కోట్ల కార్మికుల కష్టార్జితాన్ని అప్పులపాలు చేసి, సంస్థను ఆర్థిక సంక్షోభంలోకి తోశారని ఆరోపించారు. కేసీఆర్ తన హయాంలో సింగరేణి బోర్డును ఉత్సవ విగ్రహంగా మార్చి, టెండర్ల పేరుతో భారీ దోపిడీకి పాల్పడ్డారని విమర్శించారు.



## భారత్ చుట్టూ విదేశీ నిఘా?

- భారత్ చుట్టూ విదేశీ పౌరుల వరుస ఘటనలు
- అమెరికన్, ఉక్రెయిన్ పౌరుల కేసులతో చర్చ

**ఇంటర్నెట్ న్యూస్,జూలై14** భారత్‌తో పాటు దక్షిణాసియా ప్రాంతంలో విదేశీ పౌరులకు సంబంధించిన వరుస ఘటనలు భద్రతా వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల అమెరికా, ఉక్రెయిన్‌కు చెందిన వ్యక్తుల అరెస్టులు, బంగ్లాదేశ్‌లో అమెరికా ప్రత్యేక దళాల అధికారి అనుమానాస్పద మృతి వంటి పరిణామాలు ప్రాంతీయ భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

## రాష్ట్రాలు విడిపోయినా తెలుగు ప్రజలమంతా ఒక్కటే

'వెంకట్రామయ్య గారి తాలూకా' ప్రీ రిలీజ్ వేడుకలో పాల్గొన్న కవిత

**హైదరాబాద్,జూలై14,(నిజం చెప్తుతాం)** చిన్న సినిమా నిర్మాతలకు తమ పార్టీ అండగా నిలుస్తుందని, భవిష్యత్తులో తమకు రాష్ట్రాన్ని నడిపించే అవకాశం లభిస్తే వారికి మేలు చేసేలా కొత్త సినీ విధానాన్ని తీసుకొస్తామని కల్వకుంట్ల కవిత అన్నారు. అదే సమయంలో ఇటీవలి ఎన్నికల్లో ఓ వ్యక్తిని ముఖ్యమంత్రిని చేసినంతగా



ప్రజాదరణ పొందిన పాటకు సంగీతం సమకూర్చిన చరణ్ అర్జున్‌పై తనకు కాస్త కోపం ఉందని సరదాగా ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ, సినీ వర్గాల్లో ఆసక్తి రేకెత్తించాయి.

## ఏసీబీ వలలో అవినీతి తిమింగలం

పెద్దపల్లి మున్సిపల్ ఏఈ ఇంట్లో నోట్ల కట్టలు!

**హైదరాబాద్,జూలై14,(నిజం చెప్తుతాం)** పెద్దపల్లి జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం జరిపిన దాడిలో ఓ అవినీతి అధికారి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా (ఏఈ) పని చేస్తున్న కల్లేపల్లి సతీశ్ కుమార్, ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు.



# ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



వలిగొండ జూలై 14 (నిజం చెపుతాం)జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని వెలువర్తి గ్రామంలో సోమవారం అంగన్వాడీ కేంద్రాలలో, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు డాక్టర్ ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ఆల్బెండోజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమామహేశ్వరి మాట్లాడుతూ 1సంవత్సరం నుండి 19సంవత్సరాల వరకు గల పిల్లలు తప్పకుండా ఈ మాత్రలు వేసుకుని నట్టలు, నులిపురుగులను నివారించుకోవాలని తెలిపారు. అదేవిధంగా చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహార పదార్థాల పైన ఎల్లప్పుడూ మూతలు ఉండేలా చూసుకోవాలని, తినేముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, చేతి గోర్లు చిన్నవిగా ఉండేలా చూసుకోవాలని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెముడాల అనితనర్సింగ్, సిహెచ్ఓ అశోక్, ఎమ్ ఎల్ హెచ్ పి సిజ్ను, ఏఎన్ఎం సాలమ్మ, ఉష, ఆశా వర్కర్లు నమ్రత, లక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఫారాలపై ప్రజలకు పూర్తి సహకారం అందించాలి

**- అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పటేల్ వంశీ రెడ్డి**



ఆలేరు,జూలై 14 (నిజం చెపుతాం)ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా అర్హులైన ప్రతి ఓటరికి ఎస్ఐఆర్ ఫారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవడంతో పాటు వాటిని సక్రమంగా నింపేందుకు ప్రజలకు పూర్తి సహకారం అందించాలని అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి పటేల్ వంశీ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2002 నాటి ఓటరు నమోదుకు సంబంధించిన వివరాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.ఫారాలు అందజేసే సమయంలో వాటిని ఎలా నింపాలి,ఏయే పత్రాలు జతచేయాలి,ఎలాంటి పొరపాట్లు చేయకూడదనే అంశాలపై అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.తల్లిదండ్రుల ఫారాలు ముందుగా నింపితే కుటుంబంలోని పిల్లల వివరాలను నమోదు చేయడం సులభమవుతుందని పేర్కొన్నారు.ఇప్పటికీ అనేక మంది అర్హులైన ఓటర్లకు ఫారాలు అందలేదని,కొందరు ఫారాలు తీసుకోకపోవడంతో పాటు పాత ఇంటి నంబర్లు,ప్రస్తుత పోలింగ్ బూత్‌ల మార్పుల కారణంగా ప్రజలు గందరగోళానికి గురవుతున్నారని అన్నారు.2002 నాటి ఇంటి నంబర్లు,ఓటరు వివరాలను గుర్తించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.ఆధార్ కార్డు,ఓటరు గుర్తింపు కార్డులోని వ్యక్తిగత వివరాలు భిన్నంగా ఉండటంతో వాటిని సరిచేసుకునేందుకు ప్రజలు ఆన్‌లైన్ కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామాలు,వార్డుల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి ఎస్ఐఆర్ ఫారాలను నింపడంలో సిబ్బంది ప్రత్యక్షంగా సహకరించాలని సూచించారు.అవగాహన లోపంతో చాలామంది ఫారాలను తప్పుగా నింపుతున్నారని,దీనివల్ల అవి తిరస్కరణకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.గడువు తక్కువగా ఉన్నందున అన్ని గ్రామాలు,పట్టణాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ప్రతి అర్హ ఓటరు ఫారం సమర్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పటేల్ వంశీ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# హ్యాండ్లూమ్ సొసైటీ నూతన చైర్మన్, డైరెక్టర్లకు బీజేపీ ఘన సన్మానం




ఆలేరు,జూలై 14 (నిజం చెపుతాం)ఆలేరు హ్యాండ్లూమ్ వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన దాసి శంకర్,డైరెక్టర్లుగా ఎన్నికైన ఎలగందుల ఉమా ఋషి,అందే రాములు,ఎలగందుల పద్మలను భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో మంగళవారం టంగుటూరు గ్రామంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు పూజారి కుమారస్వామి మాట్లాడుతూ హ్యాండ్లూమ్ సొసైటీకి నూతనంగా ఎన్నికైన పాలకవర్గం చేనేత కార్మికుల సంక్షేమానికి అంకితభావంతో పనిచేయాలని,ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి చేరవేసేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు.సొసైటీ అభివృద్ధితో పాటు చేనేత రంగం మరింత బలోపేతం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.సన్మానానికి స్పందించిన నూతన చైర్మన్ దాసి శంకర్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ,సొసైటీ అభివృద్ధి,చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం,వారి సంక్షేమం కోసం సమష్టిగా కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కామిటికారి కృష్ణ,పిన్నింటి భాస్కర్ రెడ్డి, వడ్డేపల్లి కిషన్,ఆవునూరి సాయినాథ్,ముదిగొండ సత్తయ్య,చింతకింది నాగరాజు,కట్ట అమరేందర్ రెడ్డి,జన్నే మైపాల్,శేషత్వం,అమరేందర్,ఏలగల వెంకటేష్,బైరి మహేందర్ గౌడ్,సొసైటీ మాజీ ప్రధాన కార్యదర్శి ఎలగందుల రామ ఋషి,జాలపు మాధవ్ రెడ్డి,లక్ష్మీనారాయణ,బద్రితో పాటు పలువురు బీజేపీ కార్యకర్తలు,చేనేత కార్మికులు పాల్గొన్నారు.కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగగా,నూతనంగా ఎన్నికైన చైర్మన్,డైరెక్టర్లకు నాయకులు పుష్పగుచ్ఛాలు,శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# పేద విద్యార్థి ఉన్నత విద్యకు అండగా విజయ్

**ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ చైర్మన్ దాసరి జై రమేష్..**

**పూర్తి విద్యా ఖర్చుల భారం స్వీకారం**

మోటకొండూరు: జూలై 14(నిజం చెపుతాం)ప్రతిభకు పేదరికం అడ్డం కాకూడదనే సందేశంతో ఉదార సహాయం

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,మోటకొండూరులో 2025-26 విద్యా సంవత్సరానికి చెందిన ఎస్.ఎస్.సీ పరీక్షల్లో 534 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థి ఇంజ ప్రవీణ్ ఉన్నత విద్యకు విజయ్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ దాసరి జై రమేష్ అండగా నిలిచారు.

విద్యార్థి ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఆచంట భాగ్యశ్రీ,శ్రీనివాస చక్రవర్తి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు,మండల విద్యాధికారి కేతిరెడ్డి రఘురాం రెడ్డి ఈ విద్యార్థి పరిస్థితిని దాసరి జై రమేష్ దృష్టికి తీసుకెళ్లారు.స్పందించిన ఆయన విద్యార్థి నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించేందుకు అవసరమైన కళాశాల ఫీజులు,హాస్టల్ వసతి,భోజనం,పుస్తకాలు తదితర విద్యా సంబంధిత అన్ని ఖర్చులను పూర్తిగా భరించేందుకు ముందుకు వచ్చారు.

ప్రతిభకు పేదరికం అడ్డంకి కాకూడదనే సందేశాన్ని ఆచరణలో చూపిస్తూ,విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణానికి విద్యే ఉత్తమ పెట్టుబడి అనే నమ్మకంతో దాసరి జై రమేష్ ఈ సహాయాన్ని అందించడం అభినందనీయమని పలువురు విద్యావేత్తలు పేర్కొన్నారు.ఇలాంటి సేవా కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు,ఉన్నత లక్ష్యాల సాధనకు స్ఫూర్తినిస్తాయని వారు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భూమండ్ల జయమ్మ శ్రీనివాస్,ఉప సర్పంచ్ వంగాల నిఖిత మహేందర్,ఏపీసీ సభ్యురాలు వంగపల్లి సిద్ధమ్మ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,గ్రామ పెద్దలు,తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు దాసరి జై రమేష్ సేవా దృక్పథాన్ని హృదయపూర్వకంగా అభినందించారు. ఆయన చేపట్టిన ఈ సేవా కార్యక్రమం మరెందరికో ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు.

# గుజ్జ గ్రామంలో ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సదస్సు

సంస్థాన్ నారాయణపురం,జులై15,(నిజం చెపుతాం): సంస్థాన్ నారాయణపురం మండలం గుజ్జ గ్రామం రైతు వేదికలో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఉద్యాన అధికారిని కె. కవిత ఆయిల్ పామ్ కి సంబంధించిన రాయితీల గురించి,ఆయిల్ పామ్ సాగులో పాటించాల్సిన మెలకువలను రైతులకు వివరంగా తెలియజేయజేశారు.ఆయిల్ పామ్ సాగు చేసే రైతులు మొదటి సంవత్సరం నుండి సరైన పద్ధతులను పాటిస్తూ ఎరువులను,నీటిని సరి అయిన టైంలో తగు మోతాదులో అందిస్తే మంచి దిగుబడులను సాధించవచ్చు అని వివరించారు.రైతులు ఆయిల్ ఫామ్ లో మొదటగా పూత మొదలు కాబడినప్పటి నుండి వచ్చిన మగ మరియు ఆడ పుష్పాలను సరి అయిన టైంలో తొలగిస్తూ తగు జాగ్రత్తలు పాటించాలని రైతులకు సూచించారు.మొక్కలకు సంబంధించి ఒక మొక్కకు రైతు వాటాగా 20 రూపాయలు చెల్లించాలి అదేవిధంగా డ్రిప్పుకు సంబంధించి ఎస్సీ ఎస్టీలకు 90 శాతం,బీసీలకు 80 శాతం ఓసీలకు ఐదు ఎకరాల లోపు రైతులకు 80 శాతం,ఐదు ఎకరాల పైబడిన రైతులకు 70 శాతం,సబ్సిడీ అందజేయబడును.ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు నాలుగు సంవత్సరాల వరకు యాజమాన్య ఖర్చులకు,అంతర పంటల సాగుకు గాను ఎకరానికి 4200 చొప్పున నాలుగు సంవత్సరాల వరకు రైతు ఖాతాలో జమ చేయబడును.మిద్ పథకం కింద కొత్తగా మామిడి,జామ,నిమ్మ,బత్తాయి,డ్రాగన్ ఫ్రూట్ లాంటి పండ్ల తోటలు సాగు చేసే రైతులకు సబ్సిడీ ఇవ్వబడును.మల్చింగ్ వేసుకున్న రైతులకు మరియు బంతిపూలు సాగు చేసే రైతులు దరఖాస్తు చేసుకున్నచో ఎకరానికి 8000 చొప్పున రాయితీ ఇవ్వబడును.ఈ కార్యక్రమంలో ప్లీజ్ మండల వ్యవసాయ అధికారి పూజ,పిఎసిఎస్ చైర్మన్ దూడ యాది రెడ్డి,ఆయిల్ పెట్ ఫీల్డ్ ఆఫీసర్ కె. హరీష్,హెచ్ఈఓ. ఏ నరసింహ,రైతులు, పాల్గొన్నారు.



# పెండింగ్ స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలి

**-ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియ రాజు**



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో: జూలై 14(నిజం చెపుతాం)ప్రజాపాలన పేరుతో అధికారుల వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధాలు పాలన కొనసాగిస్తుందని,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాగానే ఏడవ గ్యారంటీ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం నిలబెల్పుతామని చెప్పిన ప్రభుత్వం విద్యార్థి సంఘాల గొంతులను నొక్కుతూ అక్రమంగా అరెస్టు చేయడం జరుగుతుందని,స్కాలర్షిప్ లో అడుగుతే అక్రమ అరెస్టు చేయడం సిగ్గుచేటుఅని,గత ఆరు సంవత్సరాల నుంచి పెండింగ్లో ఉన్న పదివేల కోట్ల స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు,ఎస్ఎఫ్ఐ ఏఐఎస్ఎఫ్ ఇతర వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని పిలుపునివ్వడం జరిగింది.అందులో భాగంగా భువనగిరి జిల్లా నుండి ఛలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని ముట్టడికి వెళ్లేందుకు మందస్తుగా జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ నాయకులు అరెస్టు చేయడం జరిగింది,అరెస్టులను తీవ్రంగా ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియ రాజు మ మాట్లాడుతూ...గత ఆరు సంవత్సరాల నుంచి పెండింగ్లో ఉన్న పదివేల కోట్ల స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలి చేయాలని,స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ రాక విద్యార్థులకు చదువుకు దూరం అవుతున్నారని,గత టిఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేయకుండా కాలయాపన చేసింది,ప్రజాపాలనహౌప్రభుత్వం అధికారం వచ్చే రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికి ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకుండా విద్యార్థులకు చదువు దూరం చేసే కుట్ర చేస్తా ఉన్నది,స్కాలర్షిప్లను విద్యార్థుల నుంచే వసూలు చేయాలని జీవో నెంబర్ 7,8,9 ప్రకారం తీసుకువచ్చింది గతంలో వైయస్సార్ ముఖ్యమంత్రి ఉన్నప్పుడు తీసుకువచ్చిన స్కాలర్షిప్ పథకాన్ని,రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎత్తివేయాలని కుట్రజేస్తుందిహస్కాలర్షిప్ ల మీద ఆధారపడి పేద మధ్య తరగతి విద్యార్థులు చదువుతున్న పరిస్థితి,ఇప్పటికే స్కాలర్షిప్లు రాక ప్రవేట్ విద్యాసంస్థలు ముక్కుపుడి విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న పరిస్థితి ఉన్నది,స్కాలర్షిప్లు వస్తేనే సర్టిఫికెట్లు ఇచ్చే పరిస్థితి నెలకొంది తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ సకాలంలో విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఇంకా ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఈర్ల రాహుల్,మాజీ జిల్లా అధ్యక్షులు చింతల శివ,పట్టణ అధ్యక్షులు నేహాల్ అరెస్ట్ అయినారు అని తెలిపారు.

# మాజీ సర్పంచ్ ల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

**సుర్వి యాదయ్య గౌడ్ ముందస్తు అరెస్టు**



సంస్థాన్ నారాయణపురం,జులై15,(నిజం చెపుతాం):యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ మండలం మాజీ సర్పంచ్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,కి వినతి పత్రం అందజేస్తామని తెలంగాణ సర్పంచ్ల సంఘం జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ కమిటీతో కలిసి బయలుదేరారు.ఈ నేపథ్యంలో పోలీసులు ఆయనను ముందస్తుగా అరెస్టు చేశారు.ఈ నేపథ్యంలో యాదయ్య గౌడ్ మాట్లాడుతూ వినతిపత్రం అందజేయకుండా అడ్డుకోవడం సరైనది కాదు అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.మాజీ సర్పంచుల పదవీకాలం అయిపోయి 31 నెలలు అవుతున్నవి.మాజీ సర్పంచులు అప్పులు చేసి గ్రామాల అభివృద్ధి పనులకు నిధులను ఖర్చు చేశారు.ఇప్పుడా నిధులకు వడ్డీలు చెల్లించలేక అనేకమంది ఆత్మహత్యలు చేసుకున్నారు.వెంటనే ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులను చెల్లించి మాజీ సర్పంచులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# భాష విద్యార్థికి సులభంగా అర్థం కావాలి

**నిత్య జీవితంలో ఆ పదాలు వినియోగించేలా సామర్థ్యాలు మెరుగు పడాలి**

**పిల్లలు ఆసక్తితో బడికి వచ్చేలా బోధించాలి.**

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.**



వేములవాడ జులై 14 ( నిజంచెపుతాం )సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వెంకంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇన్ సర్వీస్ టీచర్ ట్రైనింగ్ ఉపాధ్యాయులతో కలిసి కూర్చుని విన్న జిల్లా కలెక్టర్ తరగతి గదిలోని ప్రతి విద్యార్థికి సులభంగా అర్థం అయ్యేలా ఉపాధ్యాయులు భాషను బోధించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు.

ఇన్ సర్వీస్ టీచర్ ట్రైనింగ్ లో భాగంగా ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ శిక్షణ ఇస్తుండగా, మంగళవారం ఉపాధ్యాయులతో కలిసి కూర్చుని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ విన్నారు.

ప్రతి సారి బోధించే ఉపాధ్యాయులు విద్యార్థుల స్థానంలో కూర్చుని పాఠాలు వినడం, వారి అనుభవాలను, శిక్షణ ప్రక్రియపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

అలాగే ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గీతా నగర్ సిరిసిల్ల, ఇంగ్లీష్ ఉపాధ్యాయులకు శిక్షణ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేములవాడ, ప్రాథమిక స్థాయి ఎంఆర్ పీలకు తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్ అంశాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎల్లారెడ్డిపేటలో శిక్షణ కొనసాగుతున్నది.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయులకు అందించే ఇన్ సర్వీస్ టీచర్ ట్రైనింగ్ ఎంతో మేలు చేకూరుస్తుందని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశం రోజు వారి బోధనలో ఉపయోగించాలని సూచించారు. విద్యార్థి కేంద్రీకృత, వివిధ రంగులు ఉపయోగిస్తూ.. కృత్యదార బోధన చేయాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తెలుగు, ఇంగ్లీష్, హిందీ పదాలు సులభంగా నేర్చుకునేలా బోధించాలని ఆదేశించారు. రోజు వారి జీవితంలో భాగంగా వినియోగించే పదాలు, అంకెలు, పండ్లు, ఇతర విషయాలు సులభంగా నేర్చుకునేలా బోధించాలని తెలిపారు. బోధనలో టీఎల్ఎంలు వినియోగించి.. విద్యార్థులు ఆసక్తితో బడికి వచ్చేలా వివరించాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఇంగ్లీష్, మ్యాథ్స్ ఇతర అంశాల్లో కనీస అభ్యాసన సామర్థ్యాలు మెరుగు అయ్యేలా తీర్చిదిద్దాలని పిలుపు నిచ్చారు.

ఉపాధ్యాయులందరూ శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని తరగతి గదిలో అమలు చేయాలని, మంచి ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, తహసీల్దార్ మహేష్, విద్యా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో బీఆర్ఎస్ వినూత్న నిరసన 'రేవంత్‌రెడ్డికి రక్తదానం' పేరిట క్యాంప్ ఏర్పాటు చేసిన చల్మెడ

వేములవాడ జులై 14 ( నిజంచెపుతాం )మా రక్తం తీసుకో.. రైతన్నకు నీళ్లివ్వు! సీఎం రేవంత్‌రెడ్డిపై చల్మెడ లక్ష్మీనరసింహారావు ధ్వజం

మంత్రి పదవి కోసమే ఆది శ్రీనివాస్ ఆరాటం.. ఎమ్మెల్యే తీరుపై మండిపడ్డ చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మా రక్తం తీసుకొని నీ రక్తదాహం తీర్చుకో.. కానీ కండ్ల ముందర పంటలు ఎండిపోయి కన్నీళ్లు పెడుతున్న రైతాంగాన్ని సాగునీరిచ్చి తక్షణమే ఆదుకో అని వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావులపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం వేములవాడ పట్టణంలోని చల్మెడ నివాసంలో వినూత్నంగా 'రేవంత్‌రెడ్డికి రక్తదానం' పేరిట బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీనరసింహారావు స్వయంగా పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో కలిసి రక్తదానం చేశారు.

ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పదవి దక్కించుకోవాలనే ఏకైక తాపత్రయంతోనే ఆది శ్రీనివాస్ తన స్థాయిని మరిచి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అధికార పక్షం కక్షసాధింపు రాజకీయాలు పక్కనబెట్టి, ఎండిపోతున్న పంటలను కాపాడటంపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొని రక్తదానం చేశారు.



# కలాన్ని నమ్ముకున్న జర్నలిస్టుకు కన్నీళ్లే మిగిలాయా

**గజ్జెల శ్రీనివాస్ విషాదం.. క్షేత్రస్థాయి పాత్రికేయుల భద్రతపై ప్రశ్నలు.**



వేములవాడ జూలై 14 ( నిజంచెపుతాం )ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా భావించే జర్నలిజం నేడు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోంది. సమాజ సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలవడం, అన్యాయంపై గొంతెత్తడం వంటి బాధ్యతలను మోస్తున్న పాత్రికేయుల జీవిత భద్రత మాత్రం ప్రశ్నార్థకంగా మారుతోంది.ఒకప్పుడు సమాజంలో గౌరవం, విశ్వసనీయత పొందిన ఈ వృత్తి నేడు అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. ప్రజల కోసం, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించే క్షేత్రస్థాయి జర్నలిస్టులు అవసర సమయంలో ఒంటరిగా మిగిలిపోతున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి.రాజకీయ నాయకుల ఎదుగుదలలో, ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర కీలకం. ఒక నాయకుడి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేది కూడా మీడియానే. కానీ అదే జర్నలిస్టు కష్టాల్లో ఉన్నప్పుడు, అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు లేదా మరణించినప్పుడు అండగా నిలిచే వ్యవస్థ బలహీనంగా ఉండటం బాధాకరం.కేవలం రాజకీయ నాయకులే కాదు, మీడియా సంస్థల బాధ్యత కూడా ఈ సందర్భంలో చర్చకు వస్తోంది. క్షేత్రస్థాయిలో ఎండా వానా లెక్కచేయకుండా వార్తల కోసం తిరిగే జర్నలిస్టులకు అనేక సంస్థలు సరైన వేతనాలు, ఉద్యోగ భద్రత, కుటుంబ భరోసా కల్పించలేకపోతున్నాయి. ఒక జర్నలిస్టు ఆకస్మికంగా మరణిస్తే అతని కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం కనిపించకపోవడం వ్యవస్థలోని లోపాలను బయటపెడుతోంది.ఇలాంటి పరిస్థితులకు అద్దం పట్టే ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన పాత్రికేయుడు గజ్జెల శ్రీనివాస్‌ మరణం.జర్నలిస్టులను కేవలం వార్తలు అందించే వ్యక్తులుగా కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక భాగస్వాములుగా గుర్తించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు, మీడియా యాజమాన్యాలు, జర్నలిస్టు సంఘాలు కలిసి వారి కుటుంబాల భద్రతకు స్పష్టమైన విధానాలను రూపొందించాల్సిన సమయం ఆసన్నమైంది.అలాగే జర్నలిస్టులు కూడా వృత్తిపరమైన భేదాలను పక్కనపెట్టి, ఆపద సమయంలో ఒకరికొకరు అండగా నిలవాల్సిన అవసరం ఉంది.

గజ్జెల శ్రీనివాస్ కుటుంబానికి సానుభూతి మాత్రమే కాదు.. భవిష్యత్తుకు భరోసా అవసరం. ఒక జర్నలిస్టు కుటుంబం రేపటి రోజున అనాథగా మారకుండా ఉండేందుకు సమాజం, ప్రభుత్వం, మీడియా వ్యవస్థ కలిసి బాధ్యత తీసుకోవాలి.

ఎందుకంటే... ప్రజల కోసం కలం పట్టే చేతులకు భద్రత లేకపోతే, ప్రజల గొంతుకను వినిపించే స్వరాలు క్రమంగా నిశ్శబ్దమయ్యే ప్రమాదం ఉంది

# కార్మిక కర్షక ప్రజావ్యతిరేక విధానాల పై పోరాడాలి

**కూలి బందు వెంటనే అమలు చేయాలి.**

**సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్.**



మహబూబాబాద్ తొర్రూరు జూలై 14(నిజం చెపుతాం)కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ కార్మికుల కర్షకుల గ్రామీణ పేదల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని సిపిఎం పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం రోజు తొర్రూరు మండల కేంద్రంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనం లో పార్టీ మండల కమిటీ సభ్యులు మార్క సాంబయ్య అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మండల సెమినార్ జరిగింది. ఈ సెమినార్ కు ముఖ్యఅతిథిగా హాజరైన సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్నో ఏళ్ళుగా పోరాడి సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి, వివిజి రాంజీ పథకాన్ని కాంట్రాక్టర్లకు, ధనిక వర్గానికి లాభం కలిగించే విధంగా విబిజి రాంజీ పథకాన్ని తీసుకొచ్చిందని 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడులను తెచ్చింది. కార్మికులు ట్రేడ్‌యూనియన్ పెట్టుకోవడానికి ఆంక్షలు పెట్టడం సామాజిక భద్రత కార్పొరేట్ సంస్థలు తమ స్వలాభం కొరకే పాలకవర్గాలు పాటుపడుతున్నాయని వారన్నారు. వివిజి రామ్ జి చట్టంలో 125 రోజులు పని దినాలు పెంచారు. పెరిగిన పని దినాలు కనుగుణంగా నిధులు పెంచలేదు. పైగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 90% నిధుల్లో 60 శాతం మాత్రం ఇస్తామని 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని వ్యవసాయ సీజన్లు 60 రోజులు పని దినాలు బందు చేయాలని పథకంలో పేర్కొనడం రాజ్యాంగబద్ధంగా పేదలకు పని కల్పించే బాధ్యత నుండి తప్పుకోవడమే అవుతుందన్నారు. విద్యుత్ సవరణ చట్టం 2025 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలపై జూలై 15 నుండి ఆగస్టు 10 వరకు గ్రామస్థాయి నుండి జిల్లా వరకు ఆందోళన పోరాటాలు నిర్వహించాలని, ఆగస్టు 10న జైలు భరో కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు గునగంటి రాజయ్య, మండల కార్యదర్శి ఎండి యాకూబ్, జన్నపరెడ్డి సోమిరెడ్డి, జమ్ముల శ్రీను, బోర స్వామి, దొనక దుర్గయ్య, బొల్లం మమత, ధరావత్ యాకన్న సుమన్ ,కంటపాలెం గ్రామ ఉపసర్పంచ్ జితేందర్ రెడ్డి, శంకర్, ఉమ్మగాని యాకయ్య, సోమయ్య , సంతోష్ , అమీర్, మధుబాబు, కొండ రాము, రామకృష్ణ ,రాధ, షమీనా, భాగ్య, ఆమీనా, శ్రీలత, నాగమణి, అందె మంజుల, వరలక్ష్మి ,లక్ష్మి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# ఒకే రోజు రూ.12.25 లక్షల విలువైన ఐదు ఎల్వోసీల మంజూరు

**బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.**



వేములవాడ జూలై 14 ( నిజంచెపుతాం )సిరిసిల్ల జిల్లా అత్యవసర వైద్య చికిత్స అవసరమైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు.ఒకే రోజు మొత్తం రూ.12 లక్షల 25 వేల విలువైన ఐదు ఎల్వోసీలను (లాజ) మంజూరు చేయించి బాధిత కుటుంబాలకు ఊరట కల్పించారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన మానం ప్రశాంత్ తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వెంటనే విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు.నిమ్స్ ఆసుపత్రి వైద్యులతో స్వయంగా మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.4 లక్షల ఎల్వోసీ మంజూరు చేయించారు.అదేవిధంగా గాంధీనగర్‌కు చెందిన కూరగాయల అనితకు రూ.3 లక్షలు, జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం తుర్తి గ్రామానికి చెందిన బోయినీ అంజయ్యకు రూ.2.50 లక్షలు, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామానికి చెందిన సింగారపు రాజశేఖర్‌కు రూ.2 లక్షలు, సిరిసిల్ల పట్టణానికి చెందిన నక్క జోయెల్‌కు రూ.75 వేల విలువైన ఎల్వోసీలను వైద్య చికిత్స కోసం మంజూరు చేయించారు.ప్రభుత్వ సహాయం సకాలంలో అందడంతో బాధిత కుటుంబాలు ఆనందం వ్యక్తం చేశాయి. తమకు అండగా నిలిచి వైద్య చికిత్స కోసం అవసరమైన ఆర్థిక సహాయం అందించిన రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో వెంటనే స్పందిస్తూ, పేద వైద్య అవసరాలకు ప్రభుత్వ తరఫున సహాయం అందించే విషయంలో ఆది శ్రీనివాస్ నిరంతరం కృషి చేస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు..

# రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి కేంద్రం ముందడుగు..

**కార్మికుల హక్కు సాధనకు ఎం.పీ గడ్డం వంశీకృష్ణ పోరాటం ఫలిస్తోంది..**



రామగుండం జూలై 14, (నిజం న్యూస్)కేంద్ర కార్మిక ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ హైదరాబాద్‌కు విచ్చేసిన సందర్భంగా,రాష్ట్ర కార్మిక, ఉపాధి,శిక్షణ ఫ్యాక్టరీలు,గనులు భూగర్భ శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామితో కలిసి,రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణ అంశంపై ప్రత్యేకంగా చర్చించారు.ఈ సందర్భంగా..పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పార్టీ తరఫున కాన్ఫరెన్స్ కాల్ ద్వారా పాల్గొని, గతంలో టెండర్ దశ వరకు వెళ్లి నిలిచిపోయిన రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రి ప్రాజెక్టును వెంటనే పునఃప్రారంభించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ, రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రి సింగరేణి కార్మికులు,పారిశ్రామిక కార్మికులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న హక్కు అని పేర్కొన్నారు.వేలాది మంది కార్మిక కుటుంబాలకు అత్యాధునిక వైద్య సేవలు అందించాలంటే ఈ ఆసుపత్రి నిర్మాణం అత్యవసరమని తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సమన్వయంతో అన్ని పరిపాలనా ప్రక్రియలను వేగవంతం చేసి,నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని ఆయన కోరారు.

ఈ అంశాన్ని పార్లమెంట్‌లో కూడా పలుమార్లు ప్రస్తావించినట్లు గుర్తు చేసిన ఎంపీ,రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రి పూర్తయ్యే వరకు తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ,రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి ఈ అంశంపై సానుకూలంగా స్పందించడం పట్ల,ఎంపీ వంశీకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

సింగరేణి కార్మికుల ఆరోగ్య భద్రతే మా ప్రాధాన్యం.. రామగుండం ఈ ఎస్ ఐ ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యే వరకు మా పోరాటం ఆగదు అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.

# చిలుకూరు శ్రీనివాస్ కి ఘన సన్మానం



సంస్థాన్ నారాయణపురం,జూలై14,(నిజం చెపుతాం)యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం కేంద్రంలో జరిగిన చేనేత సహకార సంఘం ఎలక్షన్లలో ఘన విజయం సాధించి సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,పత్రికా రిపోర్టర్ చిలుకూరి శ్రీనివాస్ ను అభినందిస్తూ శాలువాతో సన్మానించిన ఐఎన్టియూసి యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ కార్యదర్శి రాచకొండ లింగస్వామి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్నేహ స్వభావి అందరిని కలుపుకుపోయే మనస్తత్వం ఉన్నటువంటి చిలుకూరు శ్రీను ఎన్నికల్లో ఘన విజయం సాధించడం చాలా ఆనందాన్ని కలిగించిందని,అదేవిధంగా తను స్వీకరించబోయే పదవి బాధ్యతల ద్వారా చేనేత సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తారని అన్నారు.

# డీఆర్సీ సెంటర్ డంపింగ్ యార్డు మున్సిపల్ నర్సరీని ఆకస్మికంగా తనిఖీ





**మునిసిపల్ కమిషనర్ వినోద్ కుమార్**

మహబూబాబాద్, జూలై 14, జిల్లా ప్రతినిధి (నిజం న్యూస్ )మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎం. వినోద్ కుమార్ మంగళవారం నర్సంపేట ప్రధాన రోడ్డులోని డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్ (డీఆర్సీ), గాంధీపురంలోని డంపింగ్ యార్డు, కొరివి రోడ్డులోని మున్సిపల్ నర్సరీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా డీఆర్సీ సెంటర్‌లో ఘన వ్యర్థాల వర్గీకరణ, నిర్వహణ విధానాలను పరిశీలించిన కమిషనర్, వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం గాంధీపురంలోని డంపింగ్ యార్డును సందర్శించి పారిశుద్ధ్య నిర్వహణ, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, కంపోస్టింగ్ కార్యకలాపాలను పరిశీలించి సమర్థవంతంగా చేపట్టాలని పర్యావరణ ఇంజనీర్ క్రాంతికి ఆదేశాలు జారీ చేశారు.తదుపరి కొరివి రోడ్డులోని మున్సిపల్ నర్సరీని పరిశీలించిన కమిషనర్, మొక్కల సంరక్షణ, నీటి సౌకర్యాలు, నర్సరీ నిర్వహణతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని పారిశుద్ధ్య కేంద్రాలను ఆదర్శవంతంగా నిర్వహిస్తూ పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ తనిఖీలో మున్సిపల్ మేనేజర్ అంకుశావలి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి తదితరులు కమిషనర్ వెంట పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ ఫారం ఇస్తేనే ఓటు..లేదంటే జాబితాలో పేరు గల్లంతే..!

**-తహసీల్దార్ నాగరాజు.**



బయ్యారం:జులై.14(నిజం చెపుతాం )ఓటరు జాబితా ప్రక్షాళనలో భాగంగా సర్ చేపడుతున్నామని తహసీల్దార్ నాగరాజు తెలిపారు.మండలంలో జులై 24 వరకు ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ,డిజిటలైజేషన్ ప్రక్రియ జరుగుతుందని అన్నారు.ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ పత్రాలు అందిస్తున్నామని వెల్లడించారు.సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లు తప్పనిసరిగా ఎన్యుమరేషన్ పత్రాన్ని నింపి బిఎల్ఓలకు ఇస్తేనే తుది ఓటరు జాబితాలో పేరు ఉంటుందని తహసీల్దార్ స్పష్టం చేశారు.ఈ ప్రక్రియలో భాగంగా ప్రతి వ్యక్తికి రెండు ఎన్యుమరేషన్ పత్రాలు ఇస్తున్నామని తెలిపారు.రెండు ఎన్యుమరేషన్ పత్రాలు నింపి,ఒకటి బిఎల్ఓకు ఇవ్వాలన్నారు.రెండో ఎన్యుమరేషన్ పత్రాన్ని ఓటర్లు తమ వద్దే ఉంచుకోవాలని చెప్పారు. ఎన్యుమరేషన్ పత్రాన్ని నింపి ఇస్తేనే ఓటరు ముసాయిదా ఓటరు జాబితాలో పేరు ఉంటుందని వెల్లడించారు.ఎన్యుమరేషన్ పత్రము ఇవ్వకపోతే ఓటు తొలగించే అవకాశం ఉంటుందన్నారు.ఓటు తొలగించే ముందు సంబంధిత ఓటరుకు సమాచారం ఇచ్చి,వారి వివరణ తీసుకున్న తర్వాతనే ఓటు తొలగిస్తామని తెలిపారు.ఆన్‌లైన్‌లోనూ ఎన్యుమరేషన్ పత్రాలు నింపవచ్చని తహసీల్దార్ అన్నారు.ఇసి వెబ్‌సైట్‌లో ఎన్యుమరేషన్ ఫారం సమర్పించవచ్చని తెలిపారు.ఓటర్ సవరణ నిరంతరం జరిగే ప్రక్రియ అని పేర్కొన్నారు.ఎన్నికలకు ముందు జరిగేది స్పెషల్ సమ్మరి రివిజన్ అని, ఇప్పుడు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగుతుందని తహసీల్దార్ నాగరాజు వివరించారు.

# మానుకోటను బంగారు కోటగా తీర్చిదిద్దుతాం

**: ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్**

**ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలకు రూ.19.10 లక్షల మంజూరు**

మహబూబాబాద్, జూలై 14,జిల్లా ప్రతినిధి (నిజం న్యూస్ )మహబూబాబాద్ (మానుకోట) నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలుర, బాలికల కళాశాల భవనాల నిర్మాణానికి రూ.19.10 లక్షల నిధులు మంజూరైన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ బలరాం నాయక్ చిత్రపటాలకు ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్, డీసీసీ అధ్యక్షురాలు ఉమ మురళి నాయక్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మానుకోట నియోజకవర్గంలో ఇప్పటికే రూ.100 కోట్లకు పైగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. విద్య, వైద్యం, రహదారులు, తాగునీటి సౌకర్యాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. మహబూబాబాద్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఉదయపు ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఆయన అన్నారు.విద్యార్థులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మెరుగైన వసతులు కల్పిస్తూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పట్ల ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గుగులోత్ జ్యోతి రమేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గణపురం అంజయ్య, కౌన్సిలర్ బోడ రవి, ఇతర కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా, పట్టణ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విప్లవ యోధుల ఆశయాలు సాధిద్దాం.

మహబూబాబాద్ తొర్రూరు జూలై 14(నిజం చెపుతాం)భారత విప్లవోద్యమంలో తమ వంతు పాత్ర నిర్వహిస్తూ అగ్ర నాయకులు ఎదిగిన రాయల చంద్రశేఖర్ ఆశయాలను సాధిద్దామని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ తొర్రూర్ డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న అన్నారు. రాయల చంద్రశేఖర్ రెండవ వర్ధంతి సందర్భంగా ఆర్టీసీ బస్సు స్టాండ్ వద్ద ఆయన చిత్ర పాఠానికి వద్ద నివాళి అర్పించినారు. సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ తొర్రూర్ డివిజన్ నాయకులు చింత నవీన్ అధ్యక్షత వహించగా వీరన్న మాట్లాడుతూ నక్సల్ బరి విప్లవ ప్రభావంతో విప్లవోద్యమంలో పనిచేస్తూ ఎందరో వీరులు నేల కొరిగారని చంద్రశేఖర్ ఉద్యమంలో జీవితాలను త్యాగం చేసిన గొప్ప నాయకులని కొనియాడారు. చిన్నతనంలో నుండి నిర్భందాన్ని కేసులను ఎదుర్కొన్నారని అన్నారు. భారత దేశంలో మోదీ సర్కార్ దేశ సర్వసంపదలు కష్టజీవులకు దక్కకుండా కార్పొరేట్ కంపెనీలకు అప్పచెప్తున్న నేటి తరుణంలో అపార అనుభవం ఉన్న చంద్రశేఖర్,నాగన్న మృతి తీరని లోటు అని అన్నారు. వ్యవసాయ పారిశ్రామిక రంగాలను నిర్వీర్యం చేస్తూ అదాని, అంబానీ లాంటి బడా బాబులకు సంపదను పెంచుతున్న బీజేపీ-ఆర్ఎస్ఎస్ విధానాలను తిప్పి కొట్టడమే అమరులకు నిజమైన నివాళి అని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు ఆరు గ్యారంటీలు అమలులో పూర్తిగా విఫలమైనారని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై వర్గ పోరాటాలను తీవ్రతరం చేసి నూతన ప్రజాస్వామ్య విప్లవాన్ని విజయవంతం చేయటమే మాస్ లైన్ కర్తవ్యం అని అన్నారు. ఈ సభలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ నాయకులు శ్రీరాం పుల్లయ్య వెంకన్న బాలు మహేందర్ మహేష్ లక్ష్మి వెంకటమ్మ వీరమ్మ తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.



# ఎస్ఐఆర్ సవరణలో రాజకీయ పార్టీలు --అధికారులు సమన్వయంతో పనిచేయాలి






### : తహసీల్దార్ రాజేశ్వర్ రావు

మహబూబాబాద్, జూలై 14,జిల్లా ప్రతినిధి (నిజం న్యూస్ )జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా (ఎస్ఐఆర్) సవరణ, డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని మహబూబాబాద్ తహసీల్దార్ రాజేశ్వర్ కోరారు.జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక మేరకు ఇప్పటికే బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు), బూత్ సూపర్వైజర్లు, జిల్లాస్థాయి ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) సిబ్బందికి సహకరించి ప్రతి ఓటరులో అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సందర్భంగా పట్టణంలోని పది వార్డుల పోలింగ్ కేంద్రాలను ప్రత్యేక అధికారులు రాజేంద్రప్రసాద్, విజయలతో కలిసి పరిశీలించిన అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. బూత్ స్థాయిలో ఫారాల డిజిటలైజేషన్ సాధ్యం కాకపోతే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్లను సంప్రదించాలని సూచించారు. పట్టణంలో ఆరు శాదీఖానాల్లో ఆరు హెల్ప్ డెస్క్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సహాయం కోసం వెంకన్న -- 9985265725, నగేష్ -- 9440628842 నంబర్లను సంప్రదించాలని సూచించారు.ప్రతి ఓటరు తమకు అందిన ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తిగా నింపి సంబంధిత బీఎల్వోకు లేదా కార్యాలయంలో సమర్పించాలని, లేనిపక్షంలో ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. నిర్ణీత గడువులోగా ఎస్ఐఆర్ సవరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ ప్రతినిధి ఎం. వెంకన్న, కాంగ్రెస్ ప్రతినిధి సురేష్ నాయుడు, బీజేపీ ప్రతినిధి శ్యాంసుందర్ శర్మ, టీడీపీ ప్రతినిధి పి. రాము తదితరులు పాల్గొన్నారు.

## భూ రీ-సర్వే కార్యక్రమానికి ప్రజలు,రైతులు సహకరించాలి..





### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

రామగుండం జూలై 14,( నిజం న్యూస్)రాష్ట్ర ప్రభుత్వం భూ రీ-సర్వే కార్యక్రమాన్ని దశలవారీగా అమలు చేస్తోందని,భూ రీ-సర్వే కార్యక్రమానికి ప్రజలు,రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో తొలి విడతలో ధర్మారం మండలం పైడిచింతలపల్లి, పెద్దపల్లి మండలం నిమ్మన్పల్లి, సుల్తానాబాద్ మండలం రెబ్బల్దేవ్పల్లి, రామగిరి మండలం పన్నూర్,మంథని మండలం మల్లాపల్లి గ్రామాల్లో భూ రీ-సర్వే కార్యక్రమం ప్రారంభమై కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. ఆయా గ్రామాల్లో గ్రామ సరిహద్దుల నిర్ధారణ పనులు పూర్తవగా, గ్రామకంఠం సర్వే పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.అలాగే జూలై 15 నుంచి అంతర్గాం మండలం సోమనపల్లి, ఎలిగేడు మండలం లోకపేట,పెద్దపల్లి మండలం రంగంపల్లి, పాలకుర్తి మండలం గూడిపల్లి,శ్రీరాంపూర్ మండలం మంగపేట, ఓడెల మండలం గూడెం,మంథని మండలం అంగులూరు, ముత్తారం (మంథని) మండలం శుక్రవారంపేట గ్రామాల్లో భూ రీ-సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఈ గ్రామాల్లో జూలై 14న గ్రామసభలు నిర్వహించి ప్రజలకు కార్యక్రమంపై అవగాహన కల్పించినట్లు వెల్లడించారు.ప్రతి గ్రామంలో రీ-సర్వే చేపట్టే ముందు గ్రామసభ నిర్వహించి, భూ యజమానులకు కార్యక్రమం ఉద్దేశ్యం, విధివిధానాలను వివరించిన అనంతరమే సర్వే చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. సర్వే అండ్ బౌండరీస్ చట్టం-1923 నిబంధనల ప్రకారం రీ-సర్వే ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.భూ రీ-సర్వే ద్వారా, భూ హద్దుల ఖచ్చితమైన నిర్ధారణ, భూ రికార్డుల నవీకరణ,భూ వివాదాల నివారణకు దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. సర్వే సమయంలో భూ యజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవడంతో పాటు అవసరమైన పత్రాలతో అందుబాటులో ఉండాలని సూచించారు.భూ రీ-సర్వే కార్యక్రమం విజయవంతం కావడానికి సంబంధిత గ్రామాల ప్రజలు, రైతులు గ్రామసభలకు హాజరై అధికారులు, సర్వేయర్లు,లైసెన్స్డ్ సర్వేయర్లకు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో.. విజ్ఞప్తి చేశారు.

## రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### కౌన్సిలర్ బి అజయ్ సారధి రెడ్డి



మహబూబాబాద్, జూలై 14, జిల్లా ప్రతినిధి (నిజం న్యూస్ )రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, 33వ వార్డు కౌన్సిలర్ బి. అజయ్ సారధి రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 33వ వార్డులో గల రిటైర్డ్ ఉద్యోగుల కార్యాలయంలో మంగళవారం ఆయనను రిటైర్డ్ ఉద్యోగులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులు తమ సమస్యలను కౌన్సిలర్ దృష్టికి తీసుకువెళ్లగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అజయ్ సారధి రెడ్డి హామీ ఇచ్చారు. రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాల సాధన కోసం అవసరమైతే ఉద్యమాలు చేపడతామని తెలిపారు. అలాగే 33వ వార్డులోని రిటైర్డ్ ఉద్యోగుల కార్యాలయం పరిసరాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించడమే కాకుండా, భవిష్యత్తులో ఉద్యోగుల కోసం మెరుగైన భవన నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.

అనంతరం రిటైర్డ్ ఉద్యోగుల నాయకులు మైస నాగయ్య, వెంకటరెడ్డి, ఈశ్వర్ మాట్లాడుతూ మానుకోట ప్రాంత ప్రజా పోరాటాల్లో బి. అజయ్ సారధి రెడ్డి ఒక దిక్సూచిలా పనిచేస్తున్నారని కొనియాడారు. ఉద్యమం అంటే గుర్తుకు వచ్చేది అజయ్ సారధి రెడ్డేనని పేర్కొంటూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన పాత్ర ప్రశంసనీయమని అన్నారు. వరుస విజయాలతో ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని అభినందించారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల నాయకులు మైస నాగయ్య, ఈశ్వర్ కుమార్, వెంకటరెడ్డి, సంక బద్రి నారాయణ, రఘుపతి, గస్కంటి నారాయణ, నాగేందర్, వెంకటయ్య, సోమయ్య, విజయ్ కుమార్, మల్లయ్య, బొడ్ల వెంకటయ్య, రామచంద్రు, వెంకటేశ్వరరావు, ప్రసాద్ రావు, రంగారెడ్డి, రాములు, చంద్రయ్య, పెరుగు కుమార్, బిర్రు సాయి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రామగుండం పోలీస్ కమిషనర్

రామగుండం జూలై 14, (నిజం న్యూస్)సింగరేణి భరోసా యాత్రలో.. పాల్గొనేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జిల్లాకు విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని మంగళవారం ఆర్జీ-01 పరిధిలోని ఓసీపీ-05 వద్ద రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



## తెలంగాణ బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలి..





### 12వ వేజ్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి

### తాడిచర్ల బ్లాక్-2 ను సింగరేణికి కేటాయించినందుకు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి కి నాయకుల కృతజ్ఞతలు

రామగుండం జూలై 14, (నిజం న్యూస్)సింగరేణి లో "భరోసా యాత్ర" పేరుతో.. మంగళవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా ఓసిపి-5 కి విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి కి సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ వినతి పత్రం లో తెలంగాణలో ఉన్న బొగ్గు గను లను వేలం పాట లేకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలని,12వ వేజ్ బోర్డు ఒప్పంద ప్రక్రియను ప్రారంభించేందుకు తక్షణమే వేతన కమిటీని ఏర్పాటు చేయాలని,నాలుగు లేబర్ కోడ్ లతో సంబంధం లేకుండా గతంలో వలే 12వ వేజ్ బోర్డు వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేయడం జరిగిందని నాయకులు పేర్కొన్నారు. అదేవిధంగా సింగరేణికి తాడిచర్ల బ్లాక్-2 ను కేటాయించినందుకు కేంద్ర మంత్రి కి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.వినతి పత్రం అందజేసి,కేంద్ర మంత్రి కి డిమాండ్ లను వెల్లడించిన వారిలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శిమడ్డి ఎల్లా గౌడ్,కేంద్ర కార్యదర్శి కామ్రేడ్ కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను లు ఉన్నారు,ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి నాయకులు మాదన మహేష్, బోగ సతీష్ బాబు, ఎస్.వెంకట్ రెడ్డి, గండి ప్రసాద్,గుర్రం ప్రభుదాస్,మానాల శ్రీనివాస్,కారంపూరి వెంకన్న,చంద తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేసు నమోదు చేయాలని పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు

జడ్చర్ల జూలై 14,(నిజం చెపుతాం)ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులపై చేసిన వ్యాఖ్యలు ద్వేషాన్ని రెచ్చగొట్టేలా, హింసను ప్రేరేపించేలా ఉన్నాయని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ముఖ్యమంత్రిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కొడంగల్ యాదయ్య మాజీ కౌన్సిలర్లు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు



## ఎంపీ మల్లు రవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

జడ్చర్ల జూలై 13, (నిజం చెపుతాం)నాగర్‌కర్నూల్ ఎంపీ డా. మల్లు రవి జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేసి ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



## సీఎం రేవంత్‌పై జడ్చర్లలో బీఆర్ఎస్వీ నేతల ఫిర్యాదు

జడ్చర్ల జూలై 13, (నిజం చెపుతాం)మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ యువత అధ్యక్షుడు వల్లూరు వీరేష్, బీఆర్ఎస్వీ నాయకులు బాలు, సోహెల్, కార్మిక విభాగం అధ్యక్షుడు శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.



## ఎలినినో ప్రభావం ఎక్కువ ఉన్నందున ఆరుతడి పంటలు సాగు చేయాలి

### జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చందర్

వేలేరు జులై 14(నిజం న్యూస్)హన్మకొండ జిల్లా వేలేరు మండలం రైతు వేదికలో మంగళవారం రోజున రైతు నేస్తం కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చందర్ పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎలినినో వాతావరణం అనుకూలించక రైతులు నీరు తక్కువగా ఉపయోగించే ఆరుతడి పంటలు సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయ చందర్ సూచించారు. మినుములు, కంది,పెసర,కూరగాయల సాగు వైపు రైతులు ఎక్కువ మొత్తంలో సాగు చేయాలని సూచించారు వాతావరణం ఎలినినో ప్రభావం చేత వర్షాలు పడకుండా వర్షపాతం తక్కువగా నమోదవుతుంది. కావున రైతులు నీరు ఎక్కువగా అవసరం అయ్యే వరి సాగు తక్కువగా చేయాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేలేరు మండలం వ్యవసాయ అధికారి కవిత, ఏఈఓ రాజశేఖర్, మరియు రైతులు పాల్గొన్నారు.






## గౌడ యాదవ మహిళపై అనుచిత వ్యాఖ్యలు..!

### జక్కిడి శివచరణ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని గౌడ--యాదవ సంఘాల డిమాండ్

మహబూబాబాద్, జూలై 14, జిల్లా ప్రతినిధి (నిజం న్యూస్ )మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రాంగణంలో గౌడ సంఘాలు, యాదవ సంఘాలు, బహుజన రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి గౌడ సమాజం, యాదవ మహిళపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ, వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.మహాత్మా జ్యోతిబా పూలే నేషనల్ అవార్డు గ్రహీత, మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడు, బీసీ-ఎస్సీ-ఎస్టీ జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్, బహుజన రాజ్యాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ ముంజాల రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ, గౌడ సమాజం, యాదవ మహిళ ఈశ్వరమ్మపై అవమానకర వ్యాఖ్యలు చేసిన వారిపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. బాధ్యులు గౌడ, యాదవ సమాజాలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ నిరసనలో తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు జెరిపోతుల వెంకన్న గౌడ్, యాదవ నాయకులు చిత్తరి సోమన్న యాదవ్, మల్లయ్య యాదవ్, గడ్డం అగర్వాల్ గౌడ్, పెద్ది వెంకన్న గౌడ్, గండి వీరేందర్ గౌడ్ తదితర గౌడ, యాదవ, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by KAMELLA KANTHAIAH Printed at CHAITHANYA PUBLICATIONS, H.No. 1-132,Sai Baba Theatre Road, Huzurnagar, Dist:Suryapet-508204, Telangana., and Published at H.No. 2-166,Yepala Singaram (V), Huzurnagar (M), Suryapet-508204,Telangana. Editor: KAMELLA KANTHAIAH. RNI. No:TELTEL/2022/83478. Cell:9848581888. Email Id: varshaspurthi@gmail.com.

# సింగరేణికి గొప్ప వరం తాడిచర్ల-2 బ్లాక్





**జనరల్ మేనేజర్ (కో ఆర్డినేషన్ మరియు మార్కెటింగ్) టి.శ్రీనివాస్**

రామగుండం జులై 14, (నిజం న్యూస్)సింగరేణి సంస్థకు కొత్త గనుల ఆవశ్యకత అత్యంత తీవ్రంగా ఉన్న దశలో కొత్తగా తాడిచర్ల-2 బ్లాక్ కు మైనింగ్ లీజు అనుమతులు లభించడం సింగరేణికి ఒక వరం లాంటిదని జనరల్ మేనేజర్(కో ఆర్డినేషన్ మరియు మార్కెటింగ్)టి. శ్రీనివాస్ పేర్కొన్నారు.హైదరాబాద్ సింగరేణి భవన్ లో..మంగళవారం ఉదయం జరిగిన తాడిచర్ల-2 బ్లాక్ సాధన విజయోత్సవ సమావేశంలో ఆయన ప్రసంగించారు.సింగరేణిలో పాత గనులు మూతబడుతున్న నేపథ్యంలో కొత్త గనులను ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉందని,రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చొరవతో గత ఏడాది నైనీ బొగ్గు బ్లాక్ కు పూర్తి అనుమతులు సాధించి ఉత్పత్తి కూడా ప్రారంభించామని, ఇప్పుడు మైనింగ్ లీజు పొందిన తాడిచెర్ల-2 బ్లాక్ ను కూడా అనతి కాలంలో ప్రారంభించనున్నామని తెలిపారు.ఇంకా సింగరేణి ప్రాంతంలో ఉన్న ఇతర బొగ్గు బ్లాక్ లు కూడా సింగరేణికి వచ్చే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని,కొత్త బ్లాక్ ల రాకతో సింగరేణికి పూర్వ వైభవం దక్క నున్నదని తెలిపారు.తాడిచర్ల-2బ్లాక్ నుండి ప్రతీ ఏడాది కనీసం 60 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసే అవకాశం ఉందని ఈ విధంగా 45 సంవత్సరాల పాటు ఈ గని లో ఉత్పత్తి కొనసాగుతుందని తెలిపారు.ఈ గని కోసం ప్రత్యేక శ్రద్ధ చూపిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు, అనుమతులు మంజూరు చేసిన కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో.. హైదరాబాద్ సింగరేణి భవన్ లోని వివిధ విభాగాల ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

# నర్సరీ మొక్కలను పరిశీలించిన హనుమకొండ జిల్లా డీఎల్పీఓ గంగ భవాని

వేలేరు జులై 14(నిజం న్యూస్ )హన్మకొండ జిల్లా వేలేరు మండలం మేజర్ గ్రామపంచాయతీ లో సర్పంచ్ బిల్లా యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి, నర్సరీ ని పరిశీలించిన హనుమకొండ జిల్లా డిఎల్పిఓ గంగాభవాని మరియు వేలేరు మండల ఎంపీడీఓ కిషన్ నాయక్ ,ఈ సందర్భంగా డి ఎల్ పి ఓ మరియు ఎంపీడీవో మొక్కల పెంపకం మరియు నర్సరీ నిర్వహణ



మొక్కల పెంపకం కోసం సర్పంచ్ యాదగిరి తీసుకున్నటువంటి చర్యలకు గాను, వేలేరు సర్పంచ్ బిల్లా యాదగిరిని జిల్లా అధికారి అభినందించినారు.ఈ కార్యక్రమంలో వేలేరు ఎంపీఓ , బుచ్చి రెడ్డి ఏపీవో, విజయలక్ష్మి , ఎంఈఓ,చంద్ర మొగిళి, గొల్లకిష్టం పల్లె సర్పంచ్ శ్రీనివాస్,టీఏ ,ప్రతీప్ పాల్గొన్నారు.

# పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు సేవా కానుకలు అందించిన ప్రధానోపాధ్యాయులు

**- 80 స్టీల్ ప్లేట్లు, మిఠాయిల పంపిణీ**

**- త్వరలో స్పోర్ట్స్ డ్రెస్సులు, పాఠశాలకు బీరువా, మైక్ సెట్ అందజేత**



నాగారం, జూలై 14.నిజం చెపుతాంనాగారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పసునూరులో ఎఫ్ఏసీ ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ఎర్ర హరికిషన్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థినీ, విద్యార్థులందరికీ 80 స్టీల్ ప్లేట్లు మరియు మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద విద్యార్థులందరూ ప్రతిరోజూ పాఠశాలకు హాజరై క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చక్కగా చదివితే భవిష్యత్తులో వ్యక్తిగతంగా, అలాగే దాతల సహకారంతో మరిన్ని కానుకలు, ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు.ఇంకా రెండు రోజులలో విద్యార్థులందరికీ స్పోర్ట్స్ డ్రెస్సులను దాతల సహకారంతో అందించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా పాఠశాల అవసరాల కోసం పెద్ద బీరువా మరియు మైక్ సెట్ కూడా దాతల సహకారంతో అందించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు కె. సైదులు, ఎనగందుల శివకుమార్, బత్తుల కళమ్మ, గడిపల్లి రాజు, కనకం వెంకన్న, కొరదల రాములు, జక్కి శ్రీదేవి తదితరులు పాల్గొని ఎర్ర హరికిషన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు కూడా ఆయన సేవా కార్యక్రమాలను అభినందించారు

# డివైఎఫ్ఐ పోరాట ఫలితమే..!

**మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు పక్కన డ్రైనేజ్ పనులు ప్రారంభం......**



మేళ్లచెరువు జూలై 14 నిజం చెపుతాంమేళ్లచెరువు మండల కేంద్రంలో ప్రధాన రహదారి పక్కన డ్రైనేజ్ లేక ప్రజలు ఎన్నో రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. ఈ సమస్యపై డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు భావన ఆదినారాయణ ఆధ్వర్యంలో పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేయడంతో పాటు ఆందోళనలు నిర్వహించారు. ప్రజల సమస్యపై నిరంతరం ఒత్తిడి తీసుకురావడంతో అధికారులు స్పందించి మంగళవారం డ్రైనేజ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే డివైఎఫ్ఐ లక్ష్యం అని. ఎక్కడ సమస్య ఉంటే అక్కడ డివైఎఫ్ఐ ఉంటుంది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో నిరంతరం పోరాటం కొనసాగిస్తామని ఆయన అన్నారు.

# అమావాస్య వేళ శ్రీ కట్ట మైసమ్మ--పోచమ్మ తల్లి ఆలయంలో భక్తి వెల్లివిరిసింది.. అన్నప్రసాదం

**స్వాతి రాథోడ్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా**

**దేవాలయ అభివృద్ధికి రూ.51 వేల విరాళం**



షాద్‌నగర్ జూలై 14( నిజం చెపుతాం)అమావాస్య సందర్భంగా షాద్‌నగర్‌లోని శ్రీ కట్ట మైసమ్మ--పోచమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాతలు పాత్లావత్ తులసిరామ్ రాథోడ్, జమున, సునీత, కార్తీక్ రాథోడ్, రాజ్‌కుమార్ రాథోడ్, స్వాతి రాథోడ్ కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.ఈ సందర్భంగా పాత్లావత్ తులసిరమ్ రాథోడ్ కుమార్తె స్వాతి రాథోడ్ పుట్టినరోజు వేడుకలను అమ్మవారి సన్నిధిలో కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే దేవాలయం ఎదురుగా ప్లాట్ కొనుగోలు చేసి ఆలయ అభివృద్ధికి వినియోగించేందుకు రూ.51,000 విరాళాన్ని తులసిరామ్ రాథోడ్ ప్రకటించి అందజేశారు.ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం స్వీకరించాలని అన్నదాత పాత్లావత్ తులసిరామ్ రాథోడ్ కోరారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ రోమియో రమేష్, గౌరవ అధ్యక్షులు నల్లమోని శ్రీధర్, నల్లమోని భిక్షపతి, రఘునాథ్ యాదవ్, యాదగిరి యాదవ్, దంగు శ్రీనివాస్ యాదవ్, అల్వాల దర్శన్ గౌడ్, జీటీ సంతోష్ కుమార్, జంగా రాజు, అందె రాజేష్, మంచిరాల సురేష్, ఎడెల్లి శ్రీనివాస్, బైరమోని కృష్ణ, చీపిరి రవి యాదవ్, మల్లేష్, సుధాకర్ గౌడ్, ఆర్.ఎన్. రాము, చక్కటి వెంకటేష్ యాదవ్, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

నాగారం,జూలై 14.నిజం చెపుతాంనాగారం మండలం ఫణిగిరి గ్రామంలో సోమవారం సర్పంచ్ ఎర్ర సావిత్రి యాదగిరి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం పక్కన చెట్టు మొక్కను నాటారు.అనంతరం మొక్కకు నీరు పోసి దాని సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఎర్ర సావిత్రి యాదగిరి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను సంరక్షించి పెద్ద చెట్లుగా పెంచాలని అన్నారు. పచ్చదనం పెరిగితే స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.గ్రామాన్ని మరింత హరితవనంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ



కార్యక్రమంలో నాగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట బిక్షం, నరసింహారెడ్డి, బత్తుల కరుణాకర్, సత్తయ్య, శ్రీను, గ్రామ కార్యదర్శి సురేష్, తదితరులు పాల్గొన్నారు

# నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్





హుజూర్‌నగర్, జూలై 14 (నిజం చెపుతాం) పట్టణంలోని నిత్యం జనసంచారం ఎక్కువగా ఉండే ప్రధాన ప్రాంతంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ప్రమాదకర పరిస్థితిలో ఉండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ట్రాన్స్ ఫార్మర్కు అనుసంధానమైన విద్యుత్ కేబుళ్లు కాలిపోయినట్లు కనిపించడంతో పాటు, బహిర్గతంగా వేలాడుతూ ఉండటం వల్ల ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ప్రజలు భయపడుతున్నారు.ఈ ట్రాన్స్ ఫార్మర్ సమీపంలో టీ స్టాళ్లు దుకాణాలు రాకపోకలు ఎక్కువగా ఉండే ప్రాంతం కావడంతో చిన్నారులు వృద్ధులు వ్యాపారులు ఎప్పటికప్పుడు ఈ మార్గంలో సంచరిస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత విద్యుత్ అధికారులు ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోకపోవడం ప్రజల్లో అసంతృప్తికి కారణమైంది. స్థానికుల కథనం ప్రకారం ట్రాన్స్ ఫార్మర్ నుండి పొగలు రావడం కేబుళ్లు కాలినట్లు కనిపించడం తరచూ జరుగుతోందని తెలిపారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఈ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అత్యవసర చర్యలు తీసుకోవాలి...**

ట్రాన్స్ ఫార్మర్ను తక్షణమే మరమ్మతు చేయాలని ప్రమాదకరంగా ఉన్న కేబుళ్లను మార్చాలని అవసరమైతే భద్రతా కంచె ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఇలాంటి ట్రాన్స్ ఫార్మర్ ఎందుకు నిర్లక్ష్యంగా వదిలేశారు కాలిపోయిన కేబుళ్లను ఇప్పటివరకు ఎందుకు మార్చలేదుఏదైనా ప్రమాదం జరిగిన తర్వాతే అధికారులు స్పందిస్తారా.

# వేడుకగా ఎమ్మెల్యే మందుల సామెల్ జన్మదినోత్సవం

**- భారీ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిన కాంగ్రెస్ నాయకులు**



నాగారం, జూలై 14.నిజం చెపుతాం తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నాగారం మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు.నాగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కన్నెబోయిన వెంకట బిక్షం ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేసి నాయకులు,కార్యకర్తలు, మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వెంకట బిక్షం మాట్లాడుతూ ఎమ్మెల్యే మందుల సామేలు ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు.ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఆయురారోగ్యాలతో, దీర్ఘాయుష్షుతో ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పానుగంటి నరసింహారెడ్డి, ఎర్ర యాదగిరి, బయ్యాశీ వెంకన్న, ఏలమకంటి సోమయ్య, బిక్కి శీను, సర్పంచులు వంగూరు దామోదర్, బుక్క శీను, వడ్డే వెంకన్న, అంబటి శ్రీనివాస్, ఉప సర్పంచ్ భాను ప్రకాష్ యాదవ్, లక్ష్మీకాంత్ రామ్ రెడ్డి, సాయికుమార్, తదితర నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు


# మహిళల ఆత్మగౌరవ సమస్యపై జిల్లా కలెక్టర్‌కు అస్మా వినతి



జహీరాబాద్, జూలై 14: నిజం చెపుతాం నియోజకవర్గ ఇంచార్జ్ ఎండి ఫజలుద్దీన్: మహిళల ఆత్మగౌరవం, భద్రత దృష్ట్యా జహీరాబాద్ పట్టణంతో పాటు సంగారెడ్డి జిల్లాలోని ప్రజా శౌచాలయాల పరిస్థితిని మెరుగుపరచాలని కోరుతూ జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ను కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. జహీరాబాద్ పట్టణంలోని పలు ప్రజా శౌచాలయాలు చిరు వ్యాపారుల ఆక్రమణలతో కనిపించకుండా పోయాయని, ఉన్న మరుగుదొడ్లు కూడా సరైన నిర్వహణ లేక ప్రజలకు ఉపయోగపడే స్థితిలో లేవని ఫోటోలతో సహా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పట్టణంలో అవసరమైన ప్రాంతాల్లో కొత్త శౌచాలయాలు నిర్మించడంతో పాటు ప్రస్తుతం ఉన్న వాటిని మరమ్మతులు చేసి పరిశుభ్రంగా నిర్వహించాలని ఆమె కోరారు. ప్రతిరోజూ వివిధ గ్రామాల నుంచి సుమారు 20 నుంచి 30 వేల మంది జహీరాబాద్‌కు వస్తున్నప్పటికీ, ముఖ్యంగా మహిళలకు తగిన శౌచాలయ సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో కొందరు మహిళలు ఇంటి నుంచి బయలుదేరే ముందు నీరు కూడా తాగకుండా వస్తున్న పరిస్థితి నెలకొన్నట్లు వివరించారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సానుకూలంగా స్పందించి, జిల్లాలోని ప్రజా శౌచాలయాల పరిస్థితిని మెరుగుపరిచేలా సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, అధికారులకు ఆదేశాలు జారీ చేసి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# విద్యుత్ షాక్ తో ఆవు మృతి

మాడ్గుల జులై14(నిజం చెపుతాం):మాడ్గుల మండల పరిధిలోని అవురుపల్లి గ్రామానికి చెందిన చింతపల్లి అంజయ్య వ్యవసాయ పొలంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తొ ఆవు మృతి చెందిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది.పాడి రైతు చింతపల్లి అంజయ్య తెల్లవారుజామున వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చూడగా ఆవు విద్యుత్ షాక్ తో మృతి చెందినట్లు గుర్తించి సంబంధిత అధికారులకు ఫిర్యాదు అందజేయడంతో పాటు పశువైద్యాధికారికి ఫిర్యాదు చేయడంతో అందుబాటులో ఉన్న



గోపాలమిత్ర ద్వారా ఆవు మృతిపై వివరాలు తీసుకున్నారు.రైతుకు అండగా ఉన్న ఆవు మృతి వల్ల సుమారు లక్ష యాభై వేల రూపాయల నష్టం జరిగినందున బాధితుడు చింతపల్లి అంజయ్యను ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు అధికారులు చొరవ చూపాలని గ్రామస్తులు,బాధిత రైతు కోరుతున్నారు.

# నారాయణ పాఠశాలలో ప్రజాస్వామ్య స్ఫూర్తితో స్కూల్ క్యాబినెట్ ఎన్నికలు






## విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాల పెంపే లక్ష్యం -- ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

శేరిలింగంపల్లి, జులై 14 నిజం చెపుతాం ( శ్రీకాంత్ ) : - విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెంపొందించేందుకు నారాయణ స్కూల్స్ ఎల్.పి. బ్రాంచ్‌లో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన స్కూల్ క్యాబినెట్ ఎన్నికలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ ఎన్నికలు విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.ఎన్నికల ప్రక్రియను నిజమైన ప్రజాస్వామ్య విధానాన్ని ప్రతిబింబించేలా నిర్వహించారు. పోటీ చేసిన అభ్యర్థులు తమ నాయకత్వ సామర్థ్యాలను విద్యార్థులకు వివరించగా, అనంతరం విద్యార్థులు క్రమశిక్షణతో ఓటు హక్కును వినియోగించుకుని తమ ప్రతినిధులను ఎన్నుకున్నారు. ఓటింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతలను ప్రకటించారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, “నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాణానికి నాయకులు. వారిలో బాధ్యత, నాయకత్వ నైపుణ్యాలు, క్రమశిక్షణ, సేవాభావం వంటి విలువలను పెంపొందించడమే ఈ క్యాబినెట్ ఎన్నికల ప్రధాన ఉద్దేశం” అని పేర్కొంది.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, పాఠ్యాంశాలతో పాటు వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే కార్యక్రమాలకు నారాయణ విద్యాసంస్థలు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తాయని తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్నికల నిర్వహణలో విద్యార్థులు చూపిన క్రమశిక్షణ, ప్రజాస్వామ్య స్ఫూర్తి అందరినీ ఆకట్టుకుంది.

# మైలార్‌దేవ్‌పల్లి--కాటేదాన్‌లో బీఆర్ఎస్ జోష్.. జెండా ఎగరవేస్తామంటున్న ఆశావహ నేతలు.

**రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నిజం చూపుతాం ( శ్రీకాంత్)14మైలార్ దేవ్ పల్లి డివిజన్ కాటేదాన్ డివిజన్ లో ఉన్న**


బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలను నాయకులని ఐక్యమాత్రంగా చేసి ముందుకు కొనసాగుతున్నరు .అక్యం రఘు యాదవ్ యువకుడు గతంలో రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికలు జరిగిన సమయంలో కూడా యువకులనంద ఐక్యమత్యంగా చేసి ఎన్నికలు పనితీరు చాటి చెప్పాడు

రాజేంద్రనగర్ నియోజకవర్గం లో తను చేసిన పని యువకులని తోపాటు తనకు సంబంధించిన బంధువులను కూడా ఏకకాలంలో సమావేశాలు ఏర్పాటు చేసి బి ఆర్ ఎస్ పార్టీకి విజయం సాధించే వరకు పట్టు వదలకుండా పనిచేశాడు.

మైలార్ దేవ్ పల్లి డివిజన్ కాటేదాన్ డివిజన్ లో అవకాశం వస్తే ఖచ్చితంగా పోటీ చేసి జండా ఎగరవేస్తానంటూ తెలిపారు. కరోనా సమయంలో లాక్ డౌన్ సందర్భంగా దాదాపుగా డివిజన్ లక్ష్మీగూడా వాంబే కాలనీ పలు బస్తీలలో పేదలకు నిత్యవసర సరుకులతో పాటు ఎలాంటి ఇబ్బంది ఉన్న వెంటనే చర్యలు తీసుకుని ముందుకు వెళ్లి యువకులతో కలిసి ఎక్కడ సమస్య ఉంటే అక్కడికి వెళ్లి సేవాభావంతో రఘు యాదవ్ పనిచేశాడు. డివిజన్ పై గట్టి పట్టు ఉందని యువకులంతా తనకు మద్దతు ఉన్నరని కూడా పలుసార్లు తెలిపారు ఈసారి కచ్చితంగా పోటీ చేస్తా బి ఆర్ ఎస్ జెండా ఎగరవేస్తానంటూ తెలిపారు.రాము యాదవ్ గత కొన్ని సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీలో పనిచేసి తిరిగి బి ఆర్ఎస్ లోకి మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తోపాటు కార్తీక్ రెడ్డి నమ్ముకుని రాజకీయాలలో అవకాశం వస్తే పోటీ చేస్తానంటూ ఈసారి రెండు డివిజన్ అవకాశం వస్తే పోటీ చేసి జండా ఎగరవేస్తాము అక్కడ డివిజన్ కూడా స్థానికంగా ఉన్న మిగతా పార్టీ నాయకులు కూడా అవకాశం వస్తే మద్దతిస్తామంటూ తెలిపారని చెప్పాడు.బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు వెంకటేష్ కూడా గత 20 సంవత్సరాల నుండి రాజకీయంలో కొనసాగుతున్నాడు ఈసారి అవకాశం వస్తే కచ్చితంగా రెండు డివిజన్ మహిళా వచ్చినప్పటికీ కూడా బరిలో ఉండి విజయం సాధించే విధంగా ఇప్పటికే డివిజన్ కార్యకర్తలని నాయకులతోపాటు ఎక్కడ సమస్య ఉన్న అడిగి తెలుసుకుంటున్ననని రెండు డివిజన్ కూడా అందుబాటులో ఉండి ముందుకు కొనసాగుతున్న ఐక్యమత్యంగా ఎవరికి టికెట్ వచ్చిన ఈసారి బి ఆర్ ఎస్ జండా ఎగరవేయడం ఖాయమని తెలిపారు.

# గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ రాజేంద్రనగర్ కార్యాలయంలో అధికారులు బదిలీ కాకుండా ఒకే స్థానంలో ఎందుకు పనిచేస్తున్నరు.?

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నిజం చూపుతాం ( శ్రీకాంత్) 14రాజేంద్రనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం లో గత కొన్ని సంవత్సరాల నుండి అధికారులు ఒకే స్థానంలో ఉండి వృత్తి నిర్వహిస్తున్నరు. ఇంజనీరింగ్ సెక్షన్ తోపాటు టౌన్ ప్లానింగ్ లో ఉన్న కొంతమంది సిబ్బంది రాజకీయ నాయకుల సహాయంతో ఒకే కార్యాలయంలో వృత్తి నిర్వహిస్తూ మాకు ఎవ్వరు చెప్పినా వినవలసిన అవసరం లేదు అనే విధంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నరు.ఇంజనీరింగ్ సెక్షన్ లో తనకు నచ్చిన పని నచ్చినట్టుగా చేయవలసింది అనే విధంగా నిర్వహిస్తున్నారు. టెండర్లు వేయడం అధికారికి నచ్చిన కాంట్రాక్టర్ ని ముందు పెట్టి రోడ్డు పనులతో పాటు డ్రైనేజీ పనులు నిర్వహించడం. అధికారిని ఎవరు వెళ్లి ప్రశ్నించే ధైర్యం కూడా కార్యాలయంలో పనిచేసే వ్యక్తులకు అన్ని తెలిసినప్పటికీ కూడా ఎవ్వరు ప్రశ్నించొద్దు అనే విధంగా ఇంజనీరింగ్ సెక్షన్ లో పలు పనులను నిర్వహిస్తున్నరు.ఐదు మంది కాంట్రాక్టర్లు ముందుగానే ఎంచుకొని తనకు నచ్చిన విధంగా టెండర్లు వేసుకొని పని చేసుకుంటూ ముందుకు వెళ్తాడు అధికారి అధికారిని మిగతా టెండర్ వేయడానికి వచ్చిన కాంట్రాక్టర్లను కూడా తనకు నచ్చినట్టుగానే సమాధానం ఇస్తాడు నాకు అధికారంలో ఉన్న నాయకుడు అండగా ఉన్నాడు అనే విధంగా వ్యవహరిస్తాడు. గత ఆరు సంవత్సరాల నుండి ఒకే స్థానంలో అధికార పార్టీ లో మా బంధువులు ఉన్నరంటూ ఎవ్వరు ఏమి చెప్పినా నాకు ఎలాంటి సంబంధం లేదు నాకు నచ్చిన విధంగానే ఉంటాను అని అధికారులపై




కార్యాలయంలో పనిచేసే సిబ్బందిపై కూడా పలుసార్లు అరవడం బెదిరింపులకు పాల్పడడం కూడా చేశాడని సమాచారం. రాజేంద్రనగర్ ఇంజనీరింగ్ సెక్షన్ లో కాంట్రాక్ట్ పని తీసుకోవాలంటే కూడా మిగతా కాంట్రాక్టర్లకి ఒక ఇబ్బందిగా మారింది దానితో చాలామంది పని తీసుకోవడానికి కూడా ముందుకు రాకుండా నిశ్శబ్దంగా ఉండిపోయారు గత ఆరు సంవత్సరాల నుండి ఇవే వారని నడిపిస్తున్న ఆ అధికారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికంగా ఉన్న కాంట్రాక్టర్లతో పాటు రాజకీయ నాయకులు పలుసార్లు ఫిర్యాదు చేశారు అయినప్పటికీ ఎలాంటి స్పందన రాకపోవడం తనకు అధికారం అండగా ఉందని తనకు నచ్చిన విధంగానే ముందుకు కొనసాగుతున్నాడు దీనిపై ఇప్పుడు ఉన్న జోనల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామని రాజకీయ నాయకులతో పాటు కాంట్రాక్టర్లు తెలిపారు.

# నమోదు ప్రక్రియలో చురుగ్గా పాల్గొన్న ప్రజాప్రతినిధి, సామాజిక శ్రేణులు

నిర్మల్: జూలై 14:(నిజం చెపుతాం నిర్మల్ జిల్లా ప్రతినిధి):పట్టణంలో ప్రతిష్టాత్మకంగా సాగుతున్న సామాజిక సమాచార సేకరణ ప్రక్రియలో భాగంగా నేడు వివరాల నమోదు పత్రాల స్వీకరణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. పంతొమ్మిదవ వార్డు పరిధిలో సాగిన ఈ క్షేత్రస్థాయి కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యురాలు అయిండ్ల విజయలక్ష్మి నేతృత్వంలో భారతీయ జనతా పార్టీ ప్రతినిధులు, వివిధ సామాజిక సంస్థల బాధ్యులు చురుగ్గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు ప్రజల వద్దకు వెళ్లి వివరాల నమోదు ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు.కార్యక్రమంలో పార్టీ ముఖ్య ప్రతినిధులు అయిండ్ల సాత్విక్, కలగడ్డ సుధాకర్, ఎలిశెట్టి వెంకట్ రమణ పాల్గొనగా, స్థానిక రెండో స్థాయి బూత్ సమన్వయకర్త పద్దల నవీన్, బూత్ స్థాయి నిర్వాహకులు బొడ్డు సాయన్న, మారెడ్డి శ్రీకాంత్ నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు. వీరితో పాటు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ బస్తీ ప్రముఖ్ తాండ్ర సుశాంత్ పాల్గొని ఈ సేకరణ కార్యక్రమాన్ని క్రమబద్ధంగా ముందుకు నడిపించారు.



# మైలార్‌దేవ్‌పల్లి--కాటేదాన్‌లో బీఆర్ఎస్ జోష్.. జెండా ఎగరవేస్తామంటున్న ఆశావహ నేతలు.

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నిజం చూపుతాం ( శ్రీకాంత్)14మైలార్ దేవ్ పల్లి డివిజన్ కాటేదాన్ డివిజన్ లో ఉన్నబి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలను నాయకులని ఐక్యమాత్రంగా చేసి ముందుకు కొనసాగుతున్నరు .అక్యం రఘు యాదవ్ యువకుడు గతంలో రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికలు జరిగిన సమయంలో కూడా యువకులనంద ఐక్యమత్యంగా చేసి ఎన్నికలు పనితీరు చాటి చెప్పాడు రాజేంద్రనగర్ నియోజకవర్గం లో తను చేసిన పని యువకులని తోపాటు తనకు సంబంధించిన బంధువులను కూడా ఏకకాలంలో సమావేశాలు ఏర్పాటు చేసి బి ఆర్ ఎస్ పార్టీకి విజయం సాధించే వరకు పట్టు వదలకుండా పనిచేశాడు. మైలార్ దేవ్ పల్లి డివిజన్ కాటేదాన్ డివిజన్ లో అవకాశం వస్తే ఖచ్చితంగా పోటీ చేసి జండా ఎగరవేస్తానంటూ తెలిపారు. కరోనా సమయంలో లాక్ డౌన్ సందర్భంగా దాదాపుగా డివిజన్ లక్ష్మీగూడా వాంబే కాలనీ పలు బస్తీలలో పేదలకు నిత్యవసర సరుకులతో పాటు ఎలాంటి ఇబ్బంది ఉన్న వెంటనే చర్యలు తీసుకుని ముందుకు వెళ్లి యువకులతో కలిసి ఎక్కడ






సమస్య ఉంటే అక్కడికి వెళ్లి సేవాభావంతో రఘు యాదవ్ పనిచేశాడు.డివిజన్ పై గట్టి పట్టు ఉందని యువకులంతా తనకు మద్దతు ఉన్నరని కూడా పలుసార్లు తెలిపారు ఈసారి కచ్చితంగా పోటీ చేస్తా బి ఆర్ ఎస్ జెండా ఎగరవేస్తానంటూ తెలిపారు.రాము యాదవ్ గత కొన్ని సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీలో పనిచేసి తిరిగి బి ఆర్ఎస్ లోకి మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తోపాటు కార్తీక్ రెడ్డి నమ్ముకుని రాజకీయాలలో అవకాశం వస్తే పోటీ చేస్తానంటూ ఈసారి రెండు డివిజన్ అవకాశం వస్తే పోటీ చేసి జండా ఎగరవేస్తాము అక్కడ డివిజన్ కూడా స్థానికంగా ఉన్న మిగతా పార్టీ నాయకులు కూడా అవకాశం వస్తే మద్దతిస్తామంటూ తెలిపారని చెప్పాడు.బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు వెంకటేష్ కూడా గత 20 సంవత్సరాల నుండి రాజకీయంలో కొనసాగుతున్నాడు ఈసారి అవకాశం వస్తే కచ్చితంగా రెండు డివిజన్ మహిళా వచ్చినప్పటికీ కూడా బరిలో ఉండి విజయం సాధించే విధంగా ఇప్పటికే డివిజన్ కార్యకర్తలని నాయకులతోపాటు ఎక్కడ సమస్య ఉన్న అడిగి తెలుసుకుంటున్ననని రెండు డివిజన్ కూడా అందుబాటులో ఉండి ముందుకు కొనసాగుతున్న ఐక్యమత్యంగా ఎవరికి టికెట్ వచ్చిన ఈసారి బి ఆర్ ఎస్ జండా ఎగరవేయడం ఖాయమని తెలిపారు.

# ఆదిలాబాద్ కలెక్టర్ కు దంపతుల కృతజ్ఞత

ఇచ్చోడా, జులై 14 2026 (నిజం చెపుతాం ప్రతినిది)ఇచ్చోడ మండలం ముఖరా (బి) గ్రామానికి చెందిన మోహితే పూజా - సంతోష్ దంపతుల కుమార్తె శివాంగి తలసేమియా వ్యాధితో బాధపడుతోంది. గత ఆరు నెలల క్రితం బాధితురాలి చికిత్స నిమిత్తం జిల్లా కలెక్టర్ రాజర్షిషా రూ. 50,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.బెంగళూరులో బాలికకు బోన్ మ్యారో మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా పూర్తయి పూర్తిగా కోలుకుంది. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ అయిన బాలిక తండ్రి, కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ మంగళవారం కలెక్టరేట్



సమావేశ మందిరం ప్రాంగణంలో శాలువాతో సన్మానించారు.

# దస్తూరాబాద్ కేజీబీవీని సందర్శించిన జిల్లా కలెక్టర్

దస్తూరాబాద్, జూలై 14:( నిజం చెపుతాం: నిర్మల్ జిల్లా ప్రతినిధి): దస్తూరాబాద్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ అకస్మాత్తుగా సందర్శించి తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, విద్యార్థినుల వసతి గృహం, వంటగదిని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. విద్యార్థినులకు అందుతున్న విద్యా బోధన, మౌలిక వసతులు, రోజువారీ మెనూ ప్రకారం అందిస్తున్న పౌష్టికాహారం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల హాజరు పట్టికలు, వివిధ రికార్డులను నిశితంగా తనిఖీ చేశారు. విద్యార్థినులకు కల్పిస్తున్న విద్యా ప్రమాణాలు, భోజన నాణ్యతపై కలెక్టర్ ప్రత్యేకంగా ఆరా తీశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ అత్యంత పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు తాగునీరు, మరుగుదొడ్ల వసతిలో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. వసతి గృహంలో విద్యార్థినుల భద్రత అత్యంత ముఖ్యమని, వార్డెన్ మరియు ప్రత్యేక అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనారోగ్యానికి గురయ్యే విద్యార్థినుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్య సహాయం సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు. విద్యాబోధనలో నాణ్యతను పెంచి విద్యార్థినుల ఉత్తమ ఫలితాల




కోసం ఉపాధ్యాయులు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ తనిఖీ కార్యక్రమంలో డిఇఓ దర్శనం భోజన్న మండల విద్యాశాఖ అధికారి, పాఠశాల ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులు, స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లాలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటనకు సర్వం సిద్ధం

నిర్మల్ జూలై 14:(నిజం చెపుతాం నిర్మల్ జిల్లా ప్రతినిధి): తెలంగాణ ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య జూలై 15, 16 తేదీల్లో నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సాగనున్న ఈ పర్యటనకు సంబంధించి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి అధికారిక షెడ్యూల్‌ను ఖరారు చేశారు.జూలై 15 మధ్యాహ్నం 3:00 గంటలకు బాసర ఐఐఐటీ సందర్శనతో పర్యటన ప్రారంభం కానుంది. అక్కడ విద్యాసంస్థ పురోగతి, విద్యార్థుల వసతులపై అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిస్తారు.జూలై 16 ఉదయం 11:00 గంటలకు జిల్లా సమీకృత భవన సముదాయం ఐడీఓసీ నందు జిల్లా ఉన్నతాధికారులతో అత్యంత కీలకమైన సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతి, రూల్ ఆఫ్ రిజర్వేషన్ పక్కా అమలుపై సమగ్రంగా సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు.జూలై 16 మధ్యాహ్నం 3:00 గంటలకు నిర్మల్ జిల్లాలో ఈ కీలక పర్యటనను విజయవంతంగా ముగించుకుని జిల్లా అధికారుల వీడ్కోలుతో అదిలాబాద్ జిల్లాకు బయలుదేరి వెళతారు. ఈ పర్యటన జిల్లా వ్యాప్తంగా సర్వత్రా ఆసక్తిని, హర్షాన్ని రేకెత్తిస్తోంది.

# అదిలాబాద్ లో డాక్టర్ రవికిరణ్ యాదవ్ సేవా కార్యక్రమాలు

**మహిళలు ఆర్థికంగా రాణించాలి..**

**నైపుణ్యాభివృద్ధితో స్వయం ఉపాధి సాధించాలి**

**శిక్షణార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం**

**- శ్రీ సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రవికిరణ్ యాదవ్ పిలుపు,**

ఇచ్చోడా, జులై 14 2026 (నిజం చెపుతాం ప్రతినిధి)నైపుణ్యాభివృద్ధి ద్వారా మహిళలు, యువత స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలని సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రవికిరణ్ యాదవ్ అన్నారు. శని వారం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన టైలరింగ్, మగ్గం, ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసుకున్న శిక్షణార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేర్చుకున్న వృత్తి నైపుణ్యాలను ఉపాధి అవకాశాలుగా మలుచుకుని కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్ప డాలని సూచించారు. మహిళల సాధికారతకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని, భవిష్యత్తులో కూడా ట్రస్ట్ ద్వారా మరిన్ని ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ అధికారి షేక్ కలీమ్, రిటైర్డ్ ప్రొఫెసర్ సళ్ళ విజయబాబు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ సయీముద్దీన్, కమర్షియల్ టాక్స్ అధికారి మహేష్, మహేందర్ యాదవ్, మట్టా శ్రీనివాస్ యాదవ్, ఆశన్న యాదవ్, రవికాంత్ యాదవ్, శిక్షకులు అందుగుల శ్రావణి, పూజ రాథోడ్, ఓరుగంటి వీణ, నవీత, సుస్మిత, పూజిత, రేఖ, ప్రశాంత్, రాజుతో పాటు పలువురు శిక్షణార్థులు పాల్గొన్నారు.



# బాసర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక విశ్వవిద్యాలయంలో ప్రవేశాల జోరు!

**ఐదవ విడత ప్రవేశాల ప్రక్రియ విజయవంతం.. ఈ నెల పదిహేడున ఆరవ విడత కౌన్సెలింగ్, పద్దెనిమిదిన అంతర్జాతీయ ప్రత్యేక విభాగం ప్రవేశాల నిర్వహణ**




బాసర, జూలై 14:(నిజం చెపుతాం నిర్మల్ జిల్లా ప్రతినిధి):బాసరలోని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) బాసర, మహాబుబ్‌నగర్ క్యాంపస్‌లలో రెండు వేల ఇరవై ఆరు - ఇరవై ఏడు విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరేళ్ల సమీకృత సాంకేతిక విద్యా కోర్సు (ఇంటిగ్రేటెడ్ బి.టెక్) మొదటి సంవత్సరం ప్రవేశాల ప్రక్రియ అత్యంత వేగంగా పురోగమిస్తోంది. విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఐదవ విడత ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ అత్యంత పారదర్శక వాతావరణంలో విజయవంతంగా ముగిసిందని విశ్వవిద్యాలయ అధికారిక వర్గాలు వెల్లడించాయి.

ఐదవ విడత అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత వివిధ విభాగాలలో ఖాళీగా ఉన్న మిగిలిన సీట్లను క్రమపద్ధతిలో భర్తీ చేసేందుకు వీలుగా అధికారులు సమగ్ర ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ మేరకు ఆరవ విడత కౌన్సెలింగ్, ప్రత్యేక విభాగాల వారీగా భర్తీ చేసే ప్రవేశాల షెడ్యూల్, అనుసరించాల్సిన ముఖ్యమైన విధివిధానాలను అధికారులు క్రమపద్ధతిలో విడుదల చేశారు.

మొదటి దశ: ఆరవ విడత, జాతీయ క్యాడెట్ దళం ప్రత్యేక విభాగం కౌన్సెలింగ్ వివరాలు

ఐదవ విడత కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత వివిధ కారణాల వల్ల భర్తీ కాకుండా మిగిలిపోయిన ఎనిమిది ఆరవ విడత ఖాళీ సీట్లతో పాటు జాతీయ క్యాడెట్ దళం (ఎన్‌సీసీ) ప్రత్యేక విభాగానికి చెందిన రెండు సీట్ల భర్తీ కొరకు ఈ ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించబడుతుంది. ఈ రెండు విభాగాలకు సంబంధించిన ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియను ఈ నెల పదిహేడు (17-07-2026) తేదీన విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించనున్నారు. విశ్వవిద్యాలయ ప్రవేశాల మార్గదర్శకాల ప్రకారం లభ్యతలో ఉన్న ఖాళీ సీట్లకు ఒకటి ఈడు మూడు (1:3) నిష్పత్తిలో అర్హులైన అభ్యర్థులను కౌన్సెలింగ్‌కు ఆహ్వానించారు. ఒకవేళ కౌన్సెలింగ్ రోజున ఎంపికైన అభ్యర్థులు నిర్ణీత సమయానికి హాజరుకాకపోయినా లేదా ప్రవేశాలను రద్దు చేసుకున్నా ఏర్పడే ఖాళీలను మెరిట్, ప్రభుత్వ రిజర్వేషన్ నిబంధనల ప్రకారం వెయిటింగ్ లిస్ట్‌లోని తదుపరి అభ్యర్థులతో తక్షణమే భర్తీ చేస్తారు. అర్హులైన అభ్యర్థులందరికీ కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సిందిగా ఇప్పటికే లఘు సందేశాలు (ఎస్ఎంఎస్), ఇతర అధికారిక సమాచార మాధ్యమాల ద్వారా నేరుగా సమాచారం చేరవేయడం జరిగింది.

రెండవ దశ: అంతర్జాతీయ విభాగం (గ్లోబల్ కేటగిరీ) ఖాళీ సీట్ల భర్తీ వివరాలు

అంతర్జాతీయ విభాగం కింద ఖాళీగా మిగిలిపోయిన సీట్లకు సంబంధించిన ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియను ఈ నెల పద్దెనిమిది (18-07-2026) తేదీన నిర్వహించనున్నారు. సాధారణ, అంతర్జాతీయ విభాగాల కింద ఇదివరకే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో పాటు, ఇంతవరకు దరఖాస్తు చేసుకోని కొత్త అభ్యర్థులు కూడా నిర్ణీత తేదీన నేరుగా సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు హాజరు కావచ్చునని అధికారులు స్పష్టం చేశారు. ఈ విభాగంలో ప్రవేశాలు కోరుకునే విద్యార్థులు తమకు కావలసిన అర్హత ప్రమాణాలు, ఫీజుల వివరాలు, ఇతర నిబంధనల కొరకు విశ్వవిద్యాలయ యూజీ ప్రవేశాల సమాచార పత్రాన్ని పరిశీలించాలని సూచించారు.

మూడవ దశ: అభ్యర్థులు పాటించాల్సిన ముఖ్యమైన సూచనలు

ఆరవ విడత, జాతీయ క్యాడెట్ దళం, అంతర్జాతీయ విభాగాల కౌన్సెలింగ్‌లకు హాజరయ్యే విద్యార్థులందరూ తప్పనిసరిగా తమ అన్ని రకాల అసలు విద్యా ధృవీకరణ పత్రాలు, అవసరమైన ఇతర ధ్రువపత్రాలతో నిర్ణీత సమయానికి హాజరు కావాలి. ఇప్పటివరకు జరిగిన ప్రవేశాల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, విద్యార్థి అనుకూల వాతావరణంలో విజయవంతంగా సాగిందని విశ్వవిద్యాలయం సగర్వంగా ప్రకటించింది.

ప్రవేశాల విజయవంతానికి నిరంతరం సహకరిస్తున్న తెలంగాణ ప్రభుత్వం, ఉన్నతాధికారులు, శాంతిభద్రతల సిబ్బంది, వార్తా పత్రికలు, ప్రసార మాధ్యమ మిత్రులకు, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, పరిపాలనా సిబ్బందికి విశ్వవిద్యాలయ యాజమాన్యం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది.

# ప్రభుత్వ అణచివేతపై విద్యార్థి లోకం సమరభేరి

**అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు!**

**ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి: ఐప్సు నిర్మల్ జిల్లా కార్యదర్శి గడపాలి పరమేష్ హెచ్చరిక**



హైదరాబాద్: జూలై 14: (నిజం చెపుతాం నిర్మల్ జిల్లా ప్రతినిధి):రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థుల విద్యా భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్న ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ప్రశ్నించినందుకే పోలీసులు తనను అక్రమంగా అరెస్ట్ చేశారని అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఐప్సు) నిర్మల్ జిల్లా కార్యదర్శి గడపాలి పరమేష్ తీవ్రంగా ధ్వజమెత్తారు. వామపక్ష విద్యార్థి సంఘాల ఉమ్మడి ఆధ్వర్యంలో చేపట్టిన శాంతియుత 'సచివాలయ ముట్టడి' కార్యక్రమాన్ని అణచివేయడానికి ప్రభుత్వం పోలీసులను ప్రయోగించడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న తనను పోలీసులు బలవంతంగా లాక్కెళ్లి, అక్రమంగా అరెస్ట్ చేసి అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

రాష్ట్రంలో విద్యార్థులకు అందాల్సిన విద్యా ఉపకార వేతనాలు, ఫీజుల తిరుగుచెల్లింపు బకాయిలను సంవత్సరాల తరబడి పెండింగ్‌లో పెట్టడం వల్ల విద్యావ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని పరమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై తీవ్ర మానసిక ఒత్తిడి తెస్తున్నాయని, చివరకు చదువు పూర్తి చేసుకుని ఉద్యోగాల కోసం ప్రయత్నించాల్సిన విద్యార్థుల అసలు ధృవీకరణ పత్రాలను కూడా కాలేజీల వారు ఇవ్వకుండా ఆపేస్తున్న దుస్థితి నెలకొందని మండిపడ్డారు.

పేద విద్యార్థుల జీవితాలతో, వారి భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడకుండా వెంటనే పెండింగ్ నిధులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి అక్రమ అరెస్టులతో, పోలీస్ నిర్బంధాలతో, లాఠీలతో విద్యార్థి ఉద్యమాలను గానీ, న్యాయమైన సమస్యలపై ఎక్కుపెట్టిన గొంతుకలను గానీ ఏమాత్రం ఆపలేరని స్పష్టం చేశారు. నిర్బంధాలు పెరిగే కొద్దీ తమ పోరాటం మరింత ఉధృతం అవుతుందని ప్రభుత్వాన్ని హెచ్చర్షిరు. ప్రభుత్వం ఇప్పటికైనా తన మొండివైఖరిని వీడి, విద్యార్థుల పెండింగ్ నిధులను క్షణమే విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి లోకాన్ని ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని పరమేష్ హెచ్చరించారు.

# బాకీలు చెల్లించరు..పైగా అరెస్టులా? సర్పంచుల గొంతు నొక్కుతున్న ప్రభుత్వం

**మాజీ సర్పంచులు ఫోరమ్ మండల అధ్యక్షుడు జాడి గంగాధర్**

జన్నారం,జూలై 14,(నిజం చెపుతాం న్యూస్)మంగళవారం హైదరాబాద్ సెక్రటేరియట్ ముట్టడికి సిద్ధమైన జన్నారం మండల సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం తీవ్ర అభ్యంతరకరం.తమ కష్టానికి ప్రతిఫలం అడుగుతున్న ప్రజాప్రతినిధులపై ఉక్కుపాదం మోపడం ద్వారా,ప్రభుత్వం తన నియంతృత్వ ధోరణిని మరోసారి బయటపెట్టుకుంది అని సర్పంచుల ఫోరమ్ మాజీ మండల అధ్యక్షుడు జాడి గంగాధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.నూతన ప్రభుత్వం ఏర్పడి 3 ఏళ్లు గడుస్తున్నా,ఇంకా పెండింగ్ బిల్లుల గురించి సర్పంచులు పోరాడాల్సి రావడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం.అభివృద్ధి పనుల కోసం అప్పులు చేసి,వడ్డీల భారం మోస్తూ ఆత్మహత్యల అంచున ఉన్న సర్పంచుల గోడును పట్టించుకోని ప్రభుత్వం,వారి గొంతును నొక్కేందుకు అరెస్టులను ఆశ్రయించడం దారుణం అని అన్నారు.నెలల తరబడి బిల్లులు విడుదల కాకపోవడంతో సర్పంచులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు.తమ సమస్యలను చెప్పుకునేందుకు సెక్రటేరియట్ వద్దకు వెళ్తున్న వారిని అడ్డుకోవడం ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాయడమేనని అన్నారు.ఈ సందర్భంగా ఫోరమ్ మండల అధ్యక్షుడు జాడి గంగాధర్ వ్యక్తం చేసిన ఆవేదన,ప్రభుత్వంపై ఉన్న తీవ్ర అసహనానికి అద్దం పడుతోంది.బిల్లులు చెల్లించకుండా సర్పంచులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తూ,అడిగితే అరెస్టులు చేయించడం ద్వారా ఈ ప్రభుత్వం సర్పంచుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయాలని చూస్తోంది.అభివృద్ధి పనుల బాధ్యతను మోసే వారికి గౌరవం ఇవ్వాల్సింది పోయి,వారిని అప్రతిష్టపాలు చేయడం మానుకోవాలి.బిల్లులన్నింటినీ విడుదల చేసి,సర్పంచుల ఆర్థిక భరోసా కల్పించకపోతే,రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తీవ్రతరం అవుతాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.అరెస్ట్ చేసిన వారిలో మాజీ సర్పంచులు భూక్య గోపాల్,నైనాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# మానవత్వానికి మారుపేరుగా జన్నారం పోలీసులు

**మూర్ఛ వచ్చిన వ్యక్తి ప్రాణాలు కాపాడి,రూ.1.08 లక్షలు అందజేత!**




జన్నారం,జూలై 14,(నిజం చెపుతాం న్యూస్)పోలీసులంటే కేవలం శాంతిభద్రతలను కాపాడటమే కాదు,ఆపదలో ఉన్న వారికి ప్రాణదాతలుగా,నిజాయితీకి నిలువుటద్దంగా ఉంటారని జన్నారం పోలీసులు నిరూపించారు.మూర్ఛతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని కాపాడటమే కాకుండా,అతను పోగొట్టుకున్న లక్షకు పైగా నగదును బాధ్యతాయుతంగా అప్పగించి అందరి మన్ననలు పొందుతున్నారు.గత ఆదివారం రాత్రి 10:37 గంటల సమయంలో,జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్లూ కోల్ట్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ దేవన్న,హోమ్ గార్డ్ నీలయ్య విధులు నిర్వహిస్తుండగా,ఓ వ్యక్తి అకస్మాత్తుగా మూర్ఛ వచ్చి నోటి నుండి నురగ వస్తూ అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించారు.వెంటనే వారు ఎస్ఐ ఉదయ్ కిరణ్‌కు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న ఎస్ఐ ఉదయ్ కిరణ్ అత్యంత వేగంగా స్పందించారు.సమయం వృథా చేయకుండా ప్రైవేట్ అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి,బాధితుడిని లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టారు.అనంతరం బాధితుడు పడివున్న ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించగా,అక్కడ ఒక కవర్‌లో రూ.1,08,000 నగదు ఉండటాన్ని గుర్తించి దాన్ని భద్రపరిచారు.బాధితుడు లోతేర్రె గ్రామానికి చెందిన కుర్సెంగా దేవరావుగా గుర్తించిన పోలీసులు,మంగళవారం గ్రామ సర్పంచ్ బోడ శంకర్ సమక్షంలో ఆ నగదును ఆయనకు అందజేశారు.తన ప్రాణాలను కాపాడటమే కాకుండా,పోయిందని ఆశ వదులుకున్న నగదును తిరిగి అందజేయడంతో దేవరావు భావోద్వేగానికి గురయ్యారు.పోలీసుల నిజాయితీని,సేవా దృక్పథాన్ని చూసి కన్నీటి పర్యంతమవుతూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఐ ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ.."ప్రజలు రాత్రి వేళల్లో ప్రయాణించేటప్పుడు పెద్ద మొత్తంలో నగదు వెంట తీసుకెళ్లవద్దని,అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని" సూచించారు.నిజాయితీతో వ్యవహరించిన ఎస్ఐ ఉదయ్ కిరణ్,హెడ్ కానిస్టేబుల్ దేవన్న,హోమ్ గార్డ్ నీలయ్యలను ఉన్నతాధికారులు మరియు స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు.

# ఘనంగా శీతల సంబరాలు

**బంజారా తండాల్లో దాటుడు సంబురాలు.**

**సాంప్రదాయ ఆట పాటలతో వెల్లి విరిసిన ఆనందం.**



పాలేరు నెలకొండపల్లి, జులై 14. ( నిజం చెప్పుతాం న్యూస్. )నెలకొండపల్లి మండల వ్యాప్తంగా బంజారా గిరిజన తండాల్లో మంగళవారం శీత్లా పండుగ (దాటుడు) సంబురాలు ఘనంగా నిర్వహించారు. తమ గ్రామ దేవత అయిన శీత్లా భవాని మాతకు భక్తిశ్రద్ధలతో సాంప్రదాయ నైవేద్యాలు సమర్పించారు. వర్షాకాలంలో పశువులు వ్యాదుల బారిన పడకుండా ఉండాలని, పశుసంపద అభివృద్ధి చెందాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, తండా సుభిక్షంగా ఉండాలని, తండ వాసులంతా ఆయురారోగ్యాలతో ఉండాలని శీత్లా భవానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పండుగ రోజున గిరిజనులు ధాన్యపు గింజలతో వెల్లి గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించడం అనాది నుండి ఆనవాయితీగా వస్తున్నట్లు తెలిపారు. పూజ కార్యక్రమం అనంతరం డప్పు దరువుల నడుమ బంజారా మహిళలు, పురుషులు తమ సాంప్రదాయ నృత్యాలు చేస్తూ, ఆట పాటలతో ఆనందోత్సాహాల నడుమ ఈ పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ పారిశ్రామిక సంఘం ఉపాధ్యక్షుడు రాధా కృష్ణమూర్తి, గోబ్రియా నాయక్, భూక్య సితియా నాయక్, తేజావత్ మోహన్ రావు, మల్లికార్జునరావు, తేజావత్ కోటేశ్వరరావు, రిటైర్మెంట్ కండక్టర్ రమణ, తండా పెద్దలు, మహిళలు, యువకులు, పిల్లలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాలో సర్పంచులకు జీపీడీపీ, వ్యర్థాల నిర్వహణ, 16వ ఆర్థిక సంఘం నిధులపై శిక్షణ




సింగరేణి, జూలై 14 (నిజం న్యూస్):ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో డిప్యూటీ పంచాయతీరాజ్ కమిషనర్ అధ్యక్షతన ఖమ్మం జిల్లా సర్పంచులకు ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ శిక్షణలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన, ఘన-ద్రవ వ్యర్థ పదార్థాల నిర్వహణ, 16వ ఆర్థిక సంఘం నిధుల సక్రమ వినియోగంపై అధికారులు సమగ్ర అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లాలోని అన్ని మండలాల సర్పంచులు పాల్గొనగా, సింగరేణి మండలం నుంచి సర్పంచులు హాజరై శిక్షణలోని అంశాలను తెలుసుకున్నారు.శిక్షణ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ, ఎంపీడీవోలు, ఎంపీవోలు, డీఆర్‌డీఓ అధికారి, మాస్టర్ ట్రైనర్లు పాల్గొని గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను వివరించి, సర్పంచులకు మార్గదర్శక సూచనలు చేశారు.గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి, నిధుల పారదర్శక వినియోగం, పరిశుభ్రత నిర్వహణలో సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఎం. ఇ. ఎఫ్. ఖమ్మం జిల్లా నాయకులు

**చెరుకుపల్లి వెంకయ్య మాదిగ, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎంఎస్పీ జాతీయ నాయకులు**

**వంగూరి ఆనందరావు మాదిగ.**



పాలేరు ముదిగొండ. జూలై 14.( నిజం చెపుతాం న్యూస్.) ఇటీవల కాలంలో అనారోగ్యానికి గురై అకాల మరణానికి గురి అయిన ఖమ్మం జిల్లా ముదిగొండ మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఖమ్మం జిల్లా నాయకులు చెరుకుపల్లి వెంకయ్య మాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జాతీయ రాష్ట్ర జిల్లా మండల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి నారు. ఈ సందర్భంగా ఆనందరావు మాదిగ మాట్లాడుతూ చెరుకుపల్లి వెంకయ్య మాదిగ, మాదిగ ఉద్యోగుల సమాఖ్య తరపునే కాక ఖమ్మం జిల్లాలో ఎమ్మార్పీఎస్ తరపున వారి సేవలు అనిర్వచనియమైనవని, వారు లేని లోటు మాదిగ ఉద్యోగుల సమాఖ్య కే కాక మాదిగ జాతికే తీరనిలోటని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసినారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా అనేక ఉద్యమ ఘట్టాలలో వెంకయ్య మాదిగ సేవలు మరిచిపోలేనివని ఉద్యమ అవసరాల రీత్యా ఉద్యమకారులకు గాని ఉద్యోగులకు సమైక్య తరపున గాని వెంకయ్య మాదిగ అందించిన సేవలు తనదైన శైలిలో అందించాలని ఈ సందర్భంగా గుర్తు చేసినారు. ఉద్యమ అధినేత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో గ్రామస్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు వెంకయ్య మాదిగ సేవలు మర్చిపోలేనివని తెలియజేసినారు. వెంకయ్య మాదిగ కు సతీమణి సావిత్రమ్మ, కుమారుడు చెరుకుపల్లి శివ, కుమార్తె హిందు కుమారి కలరు. వెంకయ్య మాదిగ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన వారిలో ఎంఎస్పి రాష్ట్ర ప్రధాన కార్య దర్శి పగిడికత్తుల ఈదయ్య మాదిగ, ఎంఎస్పి జిల్లా సీనియర్ నాయకులు కొలకపాగు వెంకట్రావు, మాదిగ గూడూరి వీరస్వామి మాదిగ, ముదిగొండ మండల ఇన్చార్జి లంజపల్లి వీరభద్రం మాదిగ, ఎమ్మార్పీఎస్ ముదిగొండ మండల అధ్యక్షులు పడిశాల నాగేశ్వరావు మాదిగ, మాజీ మండల అధ్యక్షులు కట్టగూరు సురేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ ముదిగొండ మండల అధికార ప్రతినిధి యండ్రతి నాగరాజు మాదిగ, మాదాపురం గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పడిశాల గురవయ్య మాదిగ, ముదిగొండ ఎమ్మార్పీఎస్

# చెరుకుపల్లి వెంకయ్య మాదిగ, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎంఎస్పీ జాతీయ నాయకులు

**- వంగూరి ఆనందరావు మాదిగ.**



పాలేరు ముదిగొండ. జూలై 14.( నిజం చెపుతాం న్యూస్.) ఇటీవల కాలంలో అనారోగ్యానికి గురై అకాల మరణానికి గురి అయిన ఖమ్మం జిల్లా ముదిగొండ మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఖమ్మం జిల్లా నాయకులు చెరుకుపల్లి వెంకయ్య మాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జాతీయ రాష్ట్ర జిల్లా మండల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి నారు. ఈ సందర్భంగా ఆనందరావు మాదిగ మాట్లాడుతూ చెరుకుపల్లి వెంకయ్య మాదిగ, మాదిగ ఉద్యోగుల సమాఖ్య తరపునె కాక ఖమ్మం జిల్లాలో ఎమ్మార్పీఎస్ తరపున వారి సేవలు అనిర్వశినియమైనవని, వారు లేని లోటు మాదిగ ఉద్యోగుల సమాఖ్య కే కాక మాదిగ జాతికే తీరనిలోటని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసినారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా అనేక ఉద్యమ ఘట్టాలలో వెంకయ్య మాదిగ సేవలు మరిచిపోలేనివని ఉద్యమ అవసరాల రీత్యా ఉద్యమకారులకు గాని ఉద్యోగులకు సమైక్య తరపున గాని వెంకయ్య మాదిగ అందించిన సేవలు తనదైన శైలిలో అందించాలని ఈ సందర్భంగా గుర్తు చేసినారు. ఉద్యమ అధినేత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో గ్రామస్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు వెంకయ్య మాదిగ సేవలు మర్చిపోలేనివని తెలియజేసినారు. వెంకయ్య మాదిగ కు సతీమణి సావిత్రమ్మ, కుమారుడు చెరుకుపల్లి శివ, కుమార్తె హిందు కుమారి కలరు. వెంకయ్య మాదిగ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన వారిలో ఎంఎస్పి రాష్ట్ర ప్రధాన కార్య దర్శి పగిడికత్తుల ఈదయ్య మాదిగ, ఎంఎస్పి జిల్లా సీనియర్ నాయకులు కొలకపాగు వెంకట్రావు, మాదిగ గూడూరి వీరస్వామి మాదిగ, ముదిగొండ మండల ఇన్చార్జి లంజపల్లి వీరభద్రం మాదిగ, ఎమ్మార్పీఎస్ ముదిగొండ మండల అధ్యక్షులు పడిశాల నాగేశ్వరావు మాదిగ, మాజీ మండల అధ్యక్షులు కట్టగూరు సురేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ ముదిగొండ మండల అధికార ప్రతినిధి యంద్రతి నాగరాజు మాదిగ, మాదాపురం గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పడిశాల గురవయ్య మాదిగ, ముదిగొండ ఎమ్మార్పీఎస్ గ్రామ అధికార ప్రతినిధి కట్టగూరి బాబు మాదిగ లు ఉన్నారు.

# సింగరేణి మండలంలో నియమితులైన ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాలకు నియామక పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్



సింగరేణి ,జూలై 14 (నిజం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వైరా నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాలుగా నియమితులైన అభ్యర్థులకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. చిన్నారులకు నాణ్యమైన విద్యను చిన్న వయస్సు నుంచే అందించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ విద్యను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ల నియామకం ద్వారా చిన్నారుల్లో విద్యాపట్ల ఆసక్తి పెంపొందడంతో పాటు వారి మానసిక, సామాజిక, భావోద్వేగ, శారీరక వికాసానికి బలమైన పునాది ఏర్పడుతుందని అన్నారు. నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు అంకితభావంతో విధులు నిర్వహిస్తూ విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాలు, మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తూ ప్రభుత్వ విద్యను మరింత నాణ్యమైనదిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు. తెలంగాణను విద్యా రంగంలో దేశానికి ఆదర్శంగా నిలిపే దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేస్తూ, తమ సేవల ద్వారా ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్ఠను మరింత పెంచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, సింగరేణి మండల కేంద్ర సర్పంచ్ మేదరి టోనీ, బీసీ సెల్ నాయకులు బోళ్ళ రమేష్, కిసాన్ సెల్ నాయకులు కడియాల సుధాకర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు, నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

# అక్రిడేటెడ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో 50 % ఫీజు రాయితీ కల్పించాలి..

**మండల విద్యాశాఖ అధికారి టి. రమ ను కలిసి వినతి పత్రం సమర్పించిన టియుడబ్ల్యూజె (ఐజేయు) నాయకులు..**





భద్రాచలం (టౌన్) జూలై 14 : (నిజం చెపుతాం న్యూస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, అనేక మంది వర్కింగ్ జర్నలిస్టులు పరిమిత ఆదాయంతో కుటుంబాలను పోషిస్తూ పిల్లల చదువులకు అయ్యే ఖర్చులను భరించడంలో తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారని, టియుడబ్ల్యూజె (ఐజేయు) పట్టణ అధ్యక్షులు విజ్జగిరి రాజా కిరణ్ , భద్రాచలం డివిజన్ ప్రింట్‌డఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు భూక్యా రంజిత్,ఎల్. శ్రీహరి కుమార్ అన్నారు. జిల్లా కమిటీ సూచనల మేరకు పట్టణంలోని అక్రిడేషన్ కార్డు కలిగిన జర్నలిస్టుల పిల్లలకు పాఠశాల ఫీజులో 50 % రాయితీ కల్పించాలని కోరుతూ టియుడబ్ల్యూజె (ఐజేయు) భద్రాచలం డివిజన్ కమిటీ, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండల విద్యాశాఖ అధికారి టి. రమాదేవిని కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె సానుకూలంగా స్పందించారు...ఫీజు రాయితీ అంశంపై జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులతో చర్చించి జర్నలిస్టుల పిల్లలకు 50 % రాయితీ కల్పించే విధంగా కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ కార్యదర్శి జె. జయరాం, ప్రింట్ మీడియా ఉపాధ్యక్షులు కాటా సత్యం, సహాయ కార్యదర్శి బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు మదార్, పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి. ప్రేమ్ కుమార్, కోశాధికారి బి. నాయుడు, ఆర్. వెంకట్ , పి.నాగేంద్రబాబు, యం.సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నా భూమి ని నాకు ఇప్పించండి సారూ.

**ఆక్రమించుకున్న వారి పై చర్యలు తీసుకోవాలి.**

**తహశీల్దార్ ఎదుట బాధిత మహిళ రైతు ఆందోళన.**




పాలేరు నేలకొండపల్లి, జూలై 14 ( నిజం చెపుతాం న్యూస్.)నా భూమి నాకు ఇప్పించాలని మహిళ రైతు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కు వినతి ప్రతం'ను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.నేలకొండపల్లి మండలం లోని మంగాపురంతండా కు చెందిన ధీరావత్ పుష్పావతి కి చెందిన 2 కుంటల భూమిని పక్క రైతు ఆక్రమించుకున్నారని తహశీల్దార్, పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అధికారుల సూచన మేరకు ఇరు వర్గాల వారు డిజిటల్ సర్వే. చేయించామని,సర్వే లో 2 కుంటలు సదరు రైతు భూమిలో ఎక్కువగా ఉందని నిర్ధారించారని పేర్కోన్నారు. కానీ సంబంధిత అధికారులు తన భూమి ని అప్పగించే విషయంలో పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు చెందిన భూమిని తమకు అప్పగించాలని అదే విధంగా ఆక్రమించిన సదరు వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు తమకు న్యాయం చేయకుంటే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని, అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని పేర్కోన్నారు.

# గాదేపాడుకు అదనపు ఆర్టీసీ బస్సు సర్వీసు కల్పించాలని డిపో సూపరింటెండెంట్‌కు సర్పంచ్‌ల వినతి



సింగరేణి, జూలై 14(నిజం న్యూస్):గాదేపాడు గ్రామ ప్రజల రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలని కోరుతూ ఈరోజు ఖమ్మం ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయంలో డిపో సూపరింటెండెంట్‌ను సింగరేణి మండలం లోని గ్రామ సర్పంచ్‌లు భూక్యా రంజిత్ కుమార్, ఉండం రాఘవులు మరియు గుమ్మడి సందీప్ లు కలిసి వినతిపత్రం అందజేశారు.మధ్యాహ్నం 2 గంటలకు గాదేపాడుకు చేరుకునే విధంగా అదనపు ఆర్టీసీ బస్సు ట్రిప్పును ఏర్పాటు చేయాలని వారు కోరారు. గ్రామ ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ అదనపు సర్వీసును ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.వినతిపత్రాన్ని స్వీకరించిన డిపో సూపరింటెండెంట్ సానుకూలంగా స్పందిస్తూ, ఈ విషయాన్ని డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి, త్వరలోనే గాదేపాడుకు అదనపు బస్సు ట్రిప్పు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గాదేపాడు గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# గుడిసెలు, టార్పాలిన్ ఇళ్ల పై సర్వే



పాలేరు నేలకొండపల్లి, జూలై 14 ( నిజం చెపుతాం న్యూస్.)ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం గుడిసెలు, టార్పాలిన్ కప్పుకున్న ఇళ్లలో నివసించే వారి వివరాల పై సర్వే ప్రారంభించారు.నేలకొండపల్లి మండలం లోని రాయగూడెం, చెరువుమాధారం గ్రామాలలో మంగళవారం ఎంపీడీఓ యం.యర్రయ్య ఇంటింటా సర్వే చేపట్టారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి వివరాలు'అడిగి తెలుసుకుంటున్నారు. వారు ఎన్ని ఏళ్లగా ఆ ఇండ్లలో నివాసం ఉంటున్నారు,వారు ఎల్-1 జాబితా లో కాకుండా ఎల్-2 లో ఎందుకు నమోదైయ్యారు. అందుకు గల కారణాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, ప్రభుత్వం ఆదేశాల మేరకు గుడిసెలు, టార్పాలిన్ కప్పిన ఇళ్లలో ఉంటున్న వారి వివరాలను సేకరణ " కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మండలం లోని అన్ని గ్రామాలలో సర్వే చేపట్టి నివేదికను జిల్లా అధికారులకు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేయకుండా విద్యుత్ బిల్లుల పేరుతో సర్పంచులు, కార్యదర్శులపై ఒత్తిడి తగదు -- భూక్య శివా నాయక్



సింగరేణి, జూలై 14(నిజం న్యూస్)ఖమ్మం జిల్లాగ్రామపంచాయతీ ఎన్నికలు జరిగి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు విడుదల చేయాల్సిన నిధులను ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ (అశోక్ అన్న వర్గం) ఖమ్మం జిల్లా కమిటీ కారేపల్లి సబ్ డివిజన్ కార్యదర్శి భూక్య శివా నాయక్ విమర్శించారు.

గ్రామపంచాయతీల పరిధిలో వసూలు చేసిన ఇంటి పన్నులు, నీటి పన్నుల ఆదాయం గ్రామపంచాయతీ ఖాతాల్లో జమ అయినప్పటికీ, ఆయా ఖాతాలు సీజ్‌లో ఉండటంతో గ్రామ అవసరాల కోసం ఆ నిధులను కూడా వినియోగించుకోలేని పరిస్థితి నెలకొందన్నారు.ఒకవైపు నిధుల లేమితో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టలేని పరిస్థితి ఉండగా, మరోవైపు ఎంపీడీఓలు, ఉన్నతాధికారులు గ్రామపంచాయతీల విద్యుత్ బిల్లులను చెల్లించాలని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తీసుకురావడం అన్యాయమని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గ్రామపంచాయతీలకు పెండింగ్ నిధులను విడుదల చేయడంతో పాటు, గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రతి గ్రామపంచాయతీకి రూ.50 లక్షల ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. నిధులు విడుదలయ్యే వరకు విద్యుత్ బిల్లుల చెల్లింపుల పేరుతో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి చేయడాన్ని తక్షణమే నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# సువర్ణాపురంలో ముమ్మరంగా ఎస్ఐఆర్ సర్వే...



పాలేరు ముదిగొండ, జులై 14. (నిజం చెపుతాం న్యూస్.)సువర్ణాపురం గ్రామంలో ముమ్మరంగా ఎస్ఐఆర్ సర్వే.. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, సువర్ణాపురం గ్రామ మాజీ సర్పంచ్, మాజీ బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షులు తోట ధర్మరావు ఈ కార్యక్రమం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. గ్రామంలో 800 మందికి పైగా లబ్ధిదారులు గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలోని సర్వే కేంద్రానికి హాజరై తమ వివరాలను నమోదు చేసుకుని ప్రక్రియను పూర్తి చేశారు. ఈ కార్యక్రమం సజావుగా సాగేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శి, జిపివో, బిఎల్ఓ, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు సహకరించారు. ఈ సందర్భంగా తోట ధర్మరావు మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సర్వేలు ఎంతో కీలకమని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సర్వేలో పాల్గొని తమ వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. గ్రామ ప్రజలు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత పత్రాలతో సర్వే కేంద్రానికి వచ్చి ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. గ్రామస్థుల సహకారంతో కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా, ముమ్మరంగా జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

# పేదల ఆరోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా - రూ.2.50 లక్షల ఎల్ఓసీ అందజేత

**-కౌన్సిలర్ చల్లగురుగుల కృష్ణవేణి రఘుబాబు**



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో: జూలై 14(నిజం చెపుతాం)భువనగిరి పట్టణంలోని 24వ వార్డుకు చెందిన దోసపాటి స్వప్న కుమార్తె భువనేశ్వర్ వైద్య చికిత్స కోసం స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో మంజూరైన రూ.2.50 లక్షల ఎల్ఓసీని కౌన్సిలర్ చల్లగురుగుల కృష్ణవేణి రఘుబాబు బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కృష్ణవేణి మాట్లాడుతూ, పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి అర్హులైన కుటుంబం సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా జీవించాలని ఆమె ఆకాంక్షించారు.అదేవిధంగా,గతంలో కూడా ఇదే కుటుంబానికి రూ.4 లక్షల ఆర్థిక సహాయం అందించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అండగా నిలుస్తూ, వైద్య సహాయం సహా సంక్షేమ కార్యక్రమాలను అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు,కుటుంబ సభ్యులు మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఏసీబీ దాడులు

హైదరాబాద్: నగరంలో మరోసారి ఏసీబీ దాడుల కలకలం రేగింది. హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బి. రవీందర్‌పై నమోదైన అక్రమ ఆస్తుల కేసులో తెలంగాణ అవినీతి నిరోధక శాఖ అధికారులు మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా 12 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. నానక్‌రామ్‌గూడలోని సుమధుర అక్రోపోలిస్‌లో ఉన్న రవీందర్ ఇంట్లో ఒక ప్రత్యేక బృందం సోదాలు నిర్వహిస్తోంది. ఏసీబీ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మజీద్ అలీ ఖాన్ పర్యవేక్షణలో ఈ దాడులు జరిగాయి. చీఫ్ ఇంజనీర్‌కు చెందినవని ఆరోపించబడిన ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు అవినీతి నిరోధక విచారణలో తేలడంతో డీఏ కేసు నమోదు చేయబడింది.

నిజం చెపుతాం
Nijam Cheputham తెలుగు దినపత్రిక


# వానాకాలంలోనూ 'డ్రై ఐస్' సమస్య..



**వర్షాకాలంలో గాలిలో తేమ పెరిగినా కళ్లు పొడిబారే సమస్య తగ్గదన్న నిపుణులు**

**అలర్జీలు, ఏసీ వాడకం, కాలుష్యం వంటివి 'డ్రై ఐస్'ను మరింత తీవ్రతరం చేస్తాయని వెల్లడి**

**కంప్యూటర్లు, ఫోన్ల వాడకం పెరగడం వల్ల కళ్లు పొడిబారే ప్రమాదం ఎక్కువ**

**నీళ్లు ఎక్కువగా తాగడం, తరచూ కళ్లు ఆర్పడం వంటివి సమస్యను నివారించగలవన్న నిపుణులు**

వర్షాకాలం రాగానే, మండుతున్న వేసవి నుంచి ఉపశమనం లభిస్తుంది. చల్లటి వాతావరణం, పచ్చదనం మనసుకు ఆహ్లాదాన్నిస్తాయి. గాలిలో తేమ శాతం పెరగడం వల్ల కళ్లు పొడిబారే (డ్రై ఐస్) సమస్య కూడా తగ్గుతుందని చాలామంది భావిస్తారు. కానీ, ఇది కేవలం ఒక అపోహ మాత్రమేనని, వర్షాకాలంలో కంటి ఆరోగ్యంపై మరింత శ్రద్ధ వహించాలని కంటి వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తరచూ మారే వాతావరణ పరిస్థితులు, గాలిలో పెరిగే అలర్జీ కారకాలు, ఇళ్లలో ఏసీల వాడకం, కాలుష్యం, దుమ్ము, పెరిగిన స్క్రీన్ టైమ్ వంటి అనేక అంశాలు కంటి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని వారు స్పష్టం చేస్తున్నారు.కంటి వైద్య నిపుణుల ప్రకారం.. 'డ్రై ఐ డిసీజ్' అనేది కేవలం శీతాకాల సమస్య కాదు. ఏడాది పొడవునా ముఖ్యంగా వర్షాకాలంలోనూ ఇది ఇబ్బంది పెట్టగలదు. దీనికి గల కారణాలను అర్థం చేసుకుని, సరైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

**ఏమిటీ 'డ్రై ఐ' డిసీజ్?**

కళ్లు తగినంత కన్నీటిని ఉత్పత్తి చేయనప్పుడు లేదా ఉత్పత్తి అయిన కన్నీరు వేగంగా ఆవిరైపోయినప్పుడు 'డ్రై ఐ డిసీజ్' వస్తుంది. కళ్లను తేమగా ఉంచడానికి, స్పష్టమైన చూపునకు, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పించడానికి కన్నీటి పొర (టియర్ ఫిల్మ్) చాలా అవసరం. ఈ పొర దెబ్బతిన్నప్పుడు కళ్లలో మంట, దురద, ఎరుపెక్కడం, కళ్లలో ఇసుక పడినట్లు అనిపించడం, కళ్ల నుంచి అధికంగా నీరు కారడం, చూపు మసకబారడం, కళ్లు అలసిపోవడం, వెలుతురును చూడలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. విచిత్రంగా కళ్లు పొడిబారినప్పుడు చికాకుకు ప్రతిస్పందనగా అధికంగా నీరు కారడం కూడా ఈ వ్యాధి లక్షణాలలో ఒకటి.

**వర్షాకాలంలో సమస్య ఎందుకు తీవ్రమవుతుంది?**

గాలిలో తేమ ఉన్నప్పటికీ, అనేక పర్యావరణ అంశాలు కళ్లపై ప్రభావం చూపుతాయి.

1. వాతావరణంలో ఆకస్మిక మార్పులు: వర్షాకాలానికి ముందు, ఆ సమయంలో వాతావరణంలో తేమ శాతం వేగంగా మారుతుంది. ఒకరోజు పొడిగా, వేడిగా ఉంటే మరుసటి రోజు చల్లగా, తేమగా ఉంటుంది. ఈ ఆకస్మిక మార్పులు కన్నీటి పొర స్థిరత్వాన్ని దెబ్బతీసి, ఇప్పటికే డ్రై ఐస్ సమస్యతో బాధపడేవారిలో లక్షణాలను తీవ్రతరం చేస్తాయి.
2. అలర్జీ కారకాల పెరుగుదల: వానాకాలం ఫంగస్, బూజు, దుమ్ము పురుగులు పెరగడానికి అనువైన పరిస్థితులను కల్పిస్తుంది. ఈ అలర్జీ కారకాలు కంటి ఉపరితలాన్ని చికాకుపరిచి డ్రై ఐస్ లక్షణాలను పెంచుతాయి. చాలామంది దీనిని సాధారణ అలర్జీగా పొరబడతారు.
3. ఏసీల వాడకం: వర్షాకాలంలోనూ ఉక్కపోత కారణంగా చాలామంది ఇళ్లలో, ఆఫీసుల్లో ఎక్కువ గంటలు ఏసీలు వాడుతుంటారు. ఏసీలు గదిలోని తేమను తగ్గించి, గాలిని పొడిగా మారుస్తాయి. దీనివల్ల కన్నీరు వేగంగా ఆవిరైపోయి కళ్లు పొడిబారతాయి.
4. కాలుష్యం, దుమ్ము: భారీ వర్షాలు కురవడానికి ముందు నగరాల్లో కాలుష్యం, నిర్మాణాల వల్ల దుమ్ము, ధూళి ఎక్కువగా ఉంటుంది. ఈ రేణువులు కళ్లకు చికాకు కలిగించి, సమస్యను మరింత జటిలం చేస్తాయి.

**స్క్రీన్ టైమ్ సమస్యను రెట్టింపు చేస్తుంది**

కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు లేదా టీవీల వైపు ఎక్కువసేపు ఏకాగ్రతతో చూడటం వల్ల కనురెప్పలు ఆర్పే వేగం గణనీయంగా తగ్గుతుంది. ఇది డ్రై ఐస్ సమస్యను మరింత పెంచుతుంది. దీనిని నివారించడానికి ప్రతి 20 నిమిషాలకు ఒకసారి, 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును కనీసం 20 సెకన్ల పాటు చూడాలి (20-20-20 రూల్). దీనివల్ల కళ్లకు విశ్రాంతి లభించి, రెప్పలార్పడం సహజంగా జరుగుతుంది.

# యాంటీ ఆక్సిడెంట్లు అంటే ఏమిటి.. ఇవి శరీరంలో ఏం చేస్తాయి.. ఎలా పొందాలి..?

ఎక్కువ కాలం ఆరోగ్యంగా, ఉత్సాహంగా జీవించాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. జీవితకాలాన్ని పూర్తిగా నియంత్రించడం మన చేతుల్లో లేకపోయినా, ఆరోగ్యకరమైన జీవనశైలి, పోషకాహారం ద్వారా అనేక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారాలను రోజువారీ ఆహారంలో చేర్చడం వల్ల శరీర కణాలను రక్షించడంతోపాటు వయస్సు పెరుగుతున్న కొద్దీ వచ్చే అనేక ఆరోగ్య సమస్యల ముప్పును తగ్గించడంలో సహాయపడతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ వల్ల కణాలకు కలిగే నష్టాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. గుండె జబ్బులు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో ఇవి ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా శరీరంలో వాపులను తగ్గించడం, కణాల పనితీరును మెరుగుపరచడం ద్వారా వృద్ధాప్య లక్షణాలు ఆలస్యంగా కనిపించేందుకు కూడా తోడ్పడే అవకాశం ఉంటుంది.




**నట్స్, పండ్లు, గింజలు..**

డార్క్ చాక్లెట్, దానిమ్మ, గుమ్మడికాయ గింజలు, కొత్తిమీర, బ్లూబెర్రీస్, వివిధ రకాల నట్స్, రాజ్మా, క్రాన్‌బెర్రీస్, గోజీ బెర్రీస్, టమాటాలు వంటి ఆహారాల్లో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. వీటిని సమతుల ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన అనేక పోషకాలు అందుతాయి. యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని వివిధ అవయవాలకు భిన్న రకాలుగా ప్రయోజనం చేకూరుస్తాయి. బీటా కెరోటిన్ కంటి ఆరోగ్యానికి మేలు చేస్తే, లైకోపీన్ పురుషుల ప్రోస్టేట్ ఆరోగ్యానికి తోడ్పడుతుంది. ఫ్లేవనాయిడ్లు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. స్పిరులినా రోగనిరోధక శక్తిని పెంచేందుకు ఉపయోగపడుతుంది. అలాగే టీ, కాఫీల్లో ఉండే పాలీఫెనాల్స్ కొవ్వుల ఆక్సీకరణను తగ్గించి, శరీరంలో వాపులను నియంత్రించడంలో దోహదపడతాయి. నారింజ, బెర్రీస్ వంటి పండ్లలో విటమిన్ ఎ, సి, ఇ తోపాటు పాలీఫెనాల్స్, సెలీనియం వంటి ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంతోపాటు శరీరాన్ని ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షించడంలో సహాయపడతాయి.

**అల్లం, యాలకులు..**

ఆయుర్వేదం ప్రకారం అల్లం అత్యంత ప్రయోజనకరమైన ఆహార పదార్థాల్లో ఒకటి. ఇందులో అనేక రకాల యాంటీఆక్సిడెంట్లు ఉండటం వల్ల ఫ్రీ రాడికల్స్ ప్రభావాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. దీంతో గుండె జబ్బులు, కీళ్ల నొప్పులు, కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఇది తోడ్పడుతుంది. యాలకులు కూడా ఆరోగ్యానికి మేలు చేసే సుగంధ ద్రవ్యాల్లో ఒకటి. యాలకులతో తయారుచేసిన టీ శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపించడంలో సహాయపడుతుంది. శరీర వ్యవస్థలను శుభ్రంగా ఉంచుతుంది. వాము గింజలు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వీటిలో ఉండే నియాసిన్, థైమాల్ వంటి పదార్థాలు గుండె పనితీరుకు తోడ్పడటంతోపాటు సహజ యాంటీబయోటిక్ లక్షణాలను కూడా కలిగి ఉంటాయి.

**తేనె..**

తేనెను కూడా ఆయుర్వేదంలో అత్యుత్తమ సహజ ఆహార పదార్థంగా పరిగణిస్తారు. ఇందులో ఉండే సహజ ఖనిజాలు, జీవ ఎంజైమ్‌లు రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడతాయి. అలాగే చర్మ ఆరోగ్యాన్ని కాపాడి వృద్ధాప్య లక్షణాలు ఆలస్యంగా కనిపించేందుకు కూడా కొంతవరకు దోహదపడతాయి. అయితే ఈ ఆహారాలు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయకారిగా ఉంటాయి గానీ, ఇవి ఏ వ్యాధికీ ప్రత్యామ్నాయ చికిత్స కావు. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు లేదా ప్రత్యేక ఆహార నియమాలు పాటించాల్సిన వారు వైద్యులు లేదా పోషకాహార నిపుణుల సలహాతోనే ఆహారంలో మార్పులు చేసుకోవడం మంచిదని నిపుణులు తెలియజేస్తున్నారు.

# కంటి సమస్యలు ఉన్నవారు తీసుకోవాల్సిన ఆహారాలు ఇవే.. వీటితో ఎన్నో ఉపయోగాలు..



కళ్లు పొడిబారడం (డ్రై ఐ సిండ్రోమ్) ప్రస్తుతం చాలా మందిలో కనిపిస్తున్న సాధారణ సమస్య. ఎక్కువసేపు కంప్యూటర్, మొబైల్ స్క్రీన్‌లను చూడటం, ఏసీ గదుల్లో ఎక్కువ సమయం గడపడం, వయస్సు పెరగడం, కొన్ని ఆరోగ్య సమస్యలు లేదా పోషకాల లోపం వంటి కారణాల వల్ల ఈ సమస్య తలెత్తుతుంది. దీనివల్ల కళ్లలో మంట, ఎర్రబడటం, మసకగా కనిపించడం, కనురెప్పలు అతుక్కుపోయినట్లు అనిపించడం వంటి ఇబ్బందులు ఎదురవుతాయి. అయితే కొన్ని సహజమైన చిట్కాలు, సరైన ఆహారపు అలవాట్లు ఈ సమస్య నుంచి ఉపశమనం కలిగించడంలో సహాయపడతాయి. కళ్ల ఆరోగ్యానికి విటమిన్ ఎ, విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం అవసరం. ముఖ్యంగా విటమిన్ ఎ కంటి ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది. క్యారెట్, బొప్పాయి, మామిడి, పాలకూర వంటి ఆకుకూరలు, పసుపు, ఎరుపు, ఆకుపచ్చ రంగు కూరగాయలను ఆహారంలో చేర్చడం వల్ల అవసరమైన పోషకాలు అందుతాయి. అలాగే ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల కళ్లలో సహజంగా కన్నీటి ఉత్పత్తి మెరుగుపడి పొడిబారడం తగ్గే అవకాశం ఉంటుంది.

**ఈ చిట్కాలను పాటించాలి..**

కొబ్బరి నూనె కూడా డ్రై ఐ సమస్యలో కొంత ఉపశమనం కలిగిస్తుంది. ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, తేమను కాపాడే గుణాలు కళ్ల చుట్టూ ఉన్న చర్మాన్ని మృదువుగా ఉంచడంలో సహాయపడతాయి. రెండు నుంచి మూడు చుక్కల కొబ్బరి నూనెను కళ్ల చుట్టూ నెమ్మదిగా రెండు నుంచి మూడు నిమిషాలు మసాజ్ చేసి, చర్మం పూర్తిగా పీల్చుకునే వరకు వదిలేయాలి. అయితే నూనె నేరుగా కంట్లో పడకుండా జాగ్రత్త వహించాలి. కీరదోస ముక్కలను కళ్లపై ఉంచడం కూడా ఉపశమనం కలిగించే చిట్కాల్లో ఒకటి. చల్లగా ఉంచిన కీరదోస ముక్కలను 15 నిమిషాల పాటు కళ్లపై ఉంచితే మంట, దురద, ఎర్రదనం తగ్గడంలో సహాయపడుతుంది. కీరదోసలో ఉండే విటమిన్ ఎ కళ్లకు పోషణ అందించడంలో ఉపయోగపడుతుంది. రోజూ ఒక గిన్నె పెరుగు తినడం కూడా కళ్ల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పెరుగులో విటమిన్ డి, విటమిన్ బి, విటమిన్ ఎ వంటి పోషకాలు ఉండటంతో కళ్లకు అవసరమైన పోషణ అందించి పొడిబారడం వల్ల కలిగే అసౌకర్యాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.

**ఎక్కువ సేపు ఫోన్ లేదా కంప్యూటర్ చూస్తే..**

కళ్లను తరచూ రెప్పవేయడం కూడా చాలా ముఖ్యమైన అలవాటు. రెప్పవేయడం వల్ల సహజంగా కన్నీటి పొర కంటి ఉపరితలంపై సమానంగా వ్యాపించి తేమను నిలబెడుతుంది. ముఖ్యంగా కంప్యూటర్ లేదా మొబైల్‌ను ఎక్కువసేపు ఉపయోగించే వారు ప్రతి కొద్ది నిమిషాలకు ఒకసారి రెప్పవేయడాన్ని అలవాటు చేసుకోవాలి. గోరువెచ్చని నీటిలో ముంచిన మెత్తని వస్త్రంతో కళ్లకు కాపడం పెట్టడం కూడా మంచి ఉపశమనం ఇస్తుంది. మెత్తని వస్త్రాన్ని గోరువెచ్చని నీటిలో ముంచి అదనపు నీటిని పిండి, కళ్లపై ఏడు నుంచి ఎనిమిది నిమిషాల పాటు ఉంచాలి. ఇలా చేయడం వల్ల కళ్ల చుట్టూ రక్తప్రసరణ మెరుగుపడి సహజమైన తేమ ఉత్పత్తికి దోహదపడుతుంది. అయితే కళ్లు పొడిబారడం ఎక్కువకాలం కొనసాగితే, తీవ్రమైన నొప్పి, చూపు తగ్గడం లేదా ఇతర అసాధారణ లక్షణాలు కనిపిస్తే ఇంటి చిట్కాలపై మాత్రమే ఆధారపడకుండా వెంటనే నేత్ర వైద్యుడిని సంప్రదించడం అవసరం.

# రుచిగా తింటూనే లివర్‌ను కాపాడుకోండి.. కాలేయాన్ని కాపాడే 7 బెస్ట్ స్నాక్స్ ఇవే!

ఆధునిక జీవనశైలి, గంటల తరబడి కూర్చొని పనిచేయడం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్ల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఫ్యాటీ లివర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం వల్ల కలిగే ఈ సమస్యను సరైన సమయంలో గుర్తించి, జీవనశైలిలో మార్పులు చేసుకోకపోతే తీవ్రమైన అనారోగ్యాలకు దారితీస్తుంది. అయితే, ఆరోగ్యకరమైన స్నాక్స్ తినడం ద్వారా ఈ సమస్యను నియంత్రించవచ్చని నిపుణులు చెబుతున్నారు. రుచికి రాజీ పడకుండానే కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని భరోసా ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో హార్వర్డ్ కాలేయ వ్యాధి నిపుణుడు డాక్టర్ సౌరభ్ సేథి ఫ్యాటీ లివర్‌ను అదుపులో ఉంచేందుకు సహాయపడే ఏడు అద్భుతమైన స్నాక్స్ గురించి వివరించారు. అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాలకు బదులుగా ఫైబర్, ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉండే ఈ స్నాక్స్‌ను తీసుకోవడం వల్ల రోజంతా శక్తివంతంగా ఉండటంతో పాటు జీవక్రియ కూడా మెరుగుపడుతుందని ఆయన తెలిపారు.

**డాక్టర్ సౌరభ్ సేథి సూచించిన 7 ఆరోగ్యకరమైన స్నాక్స్:**

1. నట్స్, విత్తనాలు: బాదం, వాల్‌నట్స్, పొద్దుతిరుగుడు విత్తనాలు, చియా, అవిసె గింజల్లో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కాలేయంలోని కొవ్వును తగ్గించడంలో సహాయపడతాయి. అయితే, వీటిని ఉప్పు లేకుండా పచ్చిగా లేదా డ్రై-రోస్ట్ చేసి తినడం మంచిదని డాక్టర్ సేథి సూచించారు.
2. పనీర్ లేదా మొజారెల్లా చీజ్: పనీర్, మొజారెల్లా చీజ్‌లో ప్రోటీన్, కాల్షియం అధిక మోతాదులో లభిస్తాయి. ఇవి కడుపు నిండిన అనుభూతిని ఇవ్వడమే కాకుండా, కండరాల ఆరోగ్యానికి కూడా తోడ్పడతాయి. వీటిని నేరుగా చిన్న ముక్కలుగా కట్ చేసుకుని తినవచ్చు.
3. అవకాడో: అవకాడోలో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రక్తంలోని చెడు కొవ్వులను తగ్గించి, గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అంతేకాకుండా, ఇందులో ఉండే విటమిన్-ఇ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు కాలేయాన్ని రక్షిస్తాయి. దీనిలోని ఫైబర్ ఇన్సులిన్ నిరోధకతను నియంత్రించడంలో సహాయపడుతుంది.
4. గ్రీక్ యోగర్ట్: సాధారణ పెరుగుతో పోలిస్తే గ్రీక్ యోగర్ట్‌లో ప్రోటీన్ అధికంగా ఉంటుంది. దీనిలోని ప్రోబయోటిక్స్ జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి. ఇది కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని నివారిస్తుంది. దీనికి బెర్రీలు లేదా నట్స్ జోడించి తింటే రుచితో పాటు అదనపు పోషకాలు కూడా లభిస్తాయి.
5. కూరగాయ ముక్కలు, హమ్మస్: కీరదోస, సెలెరీ వంటి కూరగాయలను ముక్కలుగా కట్ చేసి, హమ్మస్‌తో (శనగలతో చేసే ఒక రకమైన చట్నీ) కలిపి తినడం అద్భుతమైన స్నాక్. ఈ కాంబినేషన్‌లో ఫైబర్, ప్రోటీన్లు రెండూ సమృద్ధిగా లభిస్తాయి.
6. ఉడికించిన గుడ్లు: ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులకు ఉడికించిన గుడ్డు ఒక అద్భుతమైన వనరు. దీన్ని తినడం చాలా సులభం. కాలేయ ఆరోగ్యానికి మేలు చేసే ఈ స్నాక్‌పై కొద్దిగా ఉప్పు, మిరియాల పొడి చల్లుకుని తింటే సరిపోతుంది.
7. స్టీమ్డ్ ఎడమామె (సోయా చిక్కుళ్లు): మొక్కల ఆధారిత ప్రోటీన్, ఫైబర్ అధికంగా ఉండే ఎడమామె ఫ్యాటీ లివర్‌తో బాధపడేవారికి ఒక గొప్ప స్నాక్. ఇందులో హానికరమైన కొవ్వులు దాదాపుగా ఉండవు. సోయాలో ఉండే కొన్ని సమ్మేళనాలు కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని, వాపును తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి.



నిజం చెపుతాం Nijam Cheputham తెలుగు దినపత్రిక



## “నాకిద్దరు కూతుళ్లు ఉన్నారు.. ఉద్యోగం ఇవ్వండి”

‘లెనిన్’ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి భాగ్యశ్రీ బోర్సే. తాజాగా చిన్ననాటి జీవితంలోని కష్టాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగ వ్యాఖ్యలు చేసింది. తాను పుట్టిన వెంటనే తండ్రి ఉద్యోగం కోల్పోయారని, ఆ తర్వాత కుటుంబం ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు చెప్పింది. తమది దిగువ మధ్యతరగతి కుటుంబమని, చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు తమ కోసం ఎంత కష్టపడ్డారో కళ్లారా చూశానని తెలిపిందిఇంట్లో ప్రతి రూపాయిని ఎంతో జాగ్రత్తగా ఖర్చు చేసేవారని భాగ్యశ్రీ చెప్పింది. రూ.10 పచ్చిమిర్చి, రూ.10 పాలకూర కొనుగోలు చేసిన వివరాలనూ నోట్‌బుక్‌లో రాసుకునేవారని, ఒక వారం రూ.300 ఖర్చయితే తర్వాతి వారం ఎలా గడపాలా అని తల్లిదండ్రులు ఆలోచించేవారని గుర్తు చేసుకుంది. చిన్నతనంలో డబ్బు విలువ తెలియకపోయినా, పెరిగేకొద్దీ తల్లిదండ్రుల కష్టాలు అర్థమయ్యాయని వివరించింది.తన జీవితంలో ఎన్నటికీ మర్చిపోలేని ఓ సంఘటనను భాగ్యశ్రీ గుర్తు చేసుకుంది. “నాకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.. దయచేసి నాకు ఉద్యోగం ఇవ్వండి” అంటూ తన తండ్రి ఒకరి వద్ద వేడుకున్నారని తెలిపింది. చిన్న వయసులో తండ్రిని ఆ స్థితిలో చూడటం చాలా బాధ కలిగించిందని చెప్పింది. అప్పుడే ఆయన మళ్లీ ఎప్పుడూ అలాంటి పరిస్థితిని ఎదుర్కోకూడదని నిర్ణయించుకున్నానని, జీవితంలో తాను సాధించాలనుకున్న ప్రతి లక్ష్యం వెనుక తల్లిదండ్రులే ప్రేరణగా ఉన్నారని వెల్లడించింది.ఔరంగాబాద్‌కు చెందిన భాగ్యశ్రీ బోర్సే కొంతకాలం నైజీరియాలో చదువుకుని, తర్వాత ముంబైలో మోడలింగ్ ప్రారంభించింది. బాలీవుడ్‌లో చిన్న పాత్రలతో కెరీర్ ప్రారంభించిన ఆమెకు రవితేజ సరసన నటించిన ‘మిస్టర్ బచ్చన్’ సినిమా మంచి గుర్తింపు తీసుకొచ్చింది.



## ‘వీరభద్రుని రహస్యం’ ( జీ 5) సిరీస్ రివ్యూ!



మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన ఒక వెబ్ సిరీస్ ఇప్పుడు ‘జీ 5’ ఓటీటీ ఫ్లాట్ ఫామ్ పైకి వచ్చింది. అనీ .. రఘు కుంచె .. అనూరాధ .. కమల్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్ కి, భీమాగాని శ్రీవర్ధన్ రెడ్డి దర్శకత్వం వహించాడు. గ్రామీణ నేపథ్యంలో నడిచే ఈ సిరీస్, మొత్తం 60 ఎపిసోడ్స్ గా రూపొందినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం 10 ఎపిసోడ్స్ అందుబాటులో ఉన్నాయి. ఇంతవరకూ కథ ఎలా నడిచిందనేది ఇప్పుడు చూద్దాం. అది ‘వీరభద్రపురం’ అనే ఒక మారుమూల గ్రామం. అడవిని ఆనుకుని ఉన్న గ్రామం అది. ఆ గ్రామానికి యోగానందం( రఘు కుంచె) పెద్దగా ఉంటాడు. అతని తల్లి నాంచారమ్మ (అనూరాధ) పరమ గయ్యాళి. వడ్డీ వ్యాపారం చేస్తూ ఆస్తులు కూడబెడుతుంది. యోగానందం కొడుకు కార్తికేయ .. కూతుళ్లు కల్పన .. మరొకరు కావ్య. పట్నంలో మెడిసిన్ పూర్తి చేసిన కల్పన, అక్కడి నుంచి వస్తూ తన స్నేహితురాలైన ‘వెన్నెల’ (అనీ)ని వెంటబెట్టుకుని వస్తుంది.



## సంయుక్త నే రామ్ హీరోయిన్!

వరుస అవకాశాలు, విభిన్న పాత్రలతో అరిస్తూ కెరీర్‌లో విజయవంతంగా ముందుకు సాగుతున్న అందాల తార సంయుక్త మీనన్. ఈ ఏడాది సంక్రాంతికి శర్వానంద్‌తో కలిసి ‘నారీ నారీ నడుమ మురారి’ సినిమాతో పలుకరించిన ఈ భామ ప్రస్తుతం చేతిలో నాలుగైదు ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ముఖ్యంగా సంయుక్త ప్రధాన పాత్ర లో నటిస్తున్న లేడీ ఓరియంటెడ్ మూవీ ‘ది బ్లాక్ గోల్డ్’పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ మూవీ షూటింగ్ మంథనిలో ఇటీవలే ముగిసింది.బొగ్గు గనుల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ ఫిల్మ్ సంయుక్త కెరీర్‌లో ఓ మైలురాయి చిత్రంగా గుర్తుండిపోతుందని టీమ్ భావిస్తోంది. ఇంకా ‘స్వయంభు’, ‘మహారాగ్ని’ వంటి క్రేజీ ప్రాజెక్టుల్లోనూ నటిస్తోంది. ఇదిలావుండగా, సంయుక్త మరో క్రేజీ ఆఫర్‌ను అందుకున్నట్లు సమాచారం. రామ్ పోతినేని హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో ఓ సినిమాను రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. సైకాలజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూ పొందుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతానికి ‘రాపో23’ అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉన్న ఈ సినిమాలో సంయుక్త హీరోయిన్ పాత్రకు ఎంపికైందని టాక్. ఈ పాత్ర కోసం టీమ్ ఇంతకుముందు నివేదా పేతురాజ్‌ను సంప్రదించిందని, ఆమె డేట్స్ సర్దుబాటు కాకపోవ దంతో మేకర్స్ సంయుక్తను ఫైనల్ చేశారని తెలుస్తోంది.

## 100 కోట్ల బంగారం



ఇటీవల సమంత ప్రధాన పాత్రలో నటించిన యాక్షన్ ఫ్యామిలీ డ్రా మా ‘మా ఇంటి బంగారం’ విడుదల విశేషంగా ప్రేక్షకాదరణ దక్కించుకున్న సం గతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద అధికారికంగా రూ.100 కోట్ల మార్క్‌ను దా టింది. తద్వారా భారతీయ సినిమా చరిత్రలోనే రూ పొందిన మహిళా ప్రధాన చిత్రాల్లో అతిపెద్ద కమర్షియల్ విజయాల్లో ఒకటిగా తన స్థానాన్ని మరింత బలపరచుకుంది. ఈ చిత్రం తన బడ్జెట్‌పై 300 శాతం పైగా రికవరీ సాధించడం విశేషం.తెలుగులో ఇప్పటివరకు వచ్చిన మహిళా ప్రధాన సినిమాల్లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ఇది నిలిచింది. మహిళా ప్రధాన సినిమాల్లోనే 2.5 మిలియన్స్ డాలర్స్ కలెక్షన్స్‌తో అత్యధిక ఓవర్సీస్ వసూళ్లు సాధించిన చిత్రంగానూ నిలిచింది. అంతేకాకుండా భారతదేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన సోలో మహిళా ప్రధాన చిత్రాల్లో మా ఇంటి బంగారం 6వ స్థానాన్ని దక్కించుకుంది. ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి విడుదలైంది.సమంత ప్రధాన పాత్రలో నటించగా, గుల్షన్ దేవయ్య, దిగంత్ మంచాలే, గౌతమి, శ్రీముఖి, ఆనంద్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాకు వసంత్ మారింగంటి, రాజ్ కే నిడిమోరు కథను అందించగా.. బీవీ నందిని రెడ్డి దర్శకత్వం వహించారు. రాజ్, సమంత, హిమాంక్ కలిసి ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు.


## ‘లెనిన్’పై మెగాస్టార్ ప్రశంసలు..





అక్కినేని అఖిల్ హీరోగా నటించిన ‘లెనిన్’ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లు రాబడుతూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖుల నుంచి ప్రశంసల వెల్లువ కొనసాగుతోంది. తాజాగా మెగాస్టార్ చిరంజీవి కూడా చిత్రబృందాన్ని ప్రశంసించారు. ఆయన సోషల్ మీడియా వేదికగా ‘లెనిన్’ యూనిట్‌ను అభినందిస్తూ ఒక సందేశాన్ని పంచుకున్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.‘లెనిన్’ చిత్రంపై అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని, ఈ విషయం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని చిరంజీవి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఒక సినిమా విజయం సాధించడమే కాకుండా, అందరి నుంచి గొప్ప ప్రశంసలు అందుకోవడం మరింత సంతోషాన్నిచ్చే విషయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విజయం సందర్భంగా చిత్రబృందం మొత్తానికి ఆయన తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ముఖ్యంగా అఖిల్ అక్కినేని నటన గురించి చిరంజీవి ప్రత్యేకంగా ప్రస్తావించారు. “అఖిల్ నాకు మరో కొడుకులాంటి వాడు. ప్రతి సినిమాతో నటుడిగా మరింత పరిణతి సాధిస్తూ, ఎదుగుతున్న అతడిని ఇలా చూడటం చాలా ఆనందంగా ఉంది” అంటూ మెగాస్టార్ ప్రశంసలు కురిపించారు. ఈ భారీ విజయం అఖిల్ కెరీర్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేర్చడానికి నాంది కావాలని ఆకాంక్షించారు. అలాగే, తన చిరకాల మిత్రుడు నాగార్జునకు కూడా చిరంజీవి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అక్కినేని కుటుంబానికి ఇంతటి ఆనందాన్ని అందించిన ఈ విజయం వెనుక ఉన్న ప్రతి ఒక్కరూ ప్రశంసలకు అర్హులని అన్నారు. దర్శకుడు మురళీ కిశోర్ అబ్బూరు, కథానాయిక భాగ్యశ్రీ బోర్సే, నిర్మాతలు, ఇతర సాంకేతిక నిపుణులకు కూడా శుభాకాంక్షలు తెలియజేశారు.

## వైరల్ అవుతున్న ‘రామాయణం’ ఏఐ ట్రైలర్



కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతతో రూపొందించిన ‘రామాయణం’ ఫ్యాన్ మేడ్ ట్రైలర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఈ వీడియోలో శ్రీరాముడిగా మహేశ్ బాబును, రావణుడిగా జూనియర్ ఎన్టీఆర్‌ను చూపించడంతో నెటిజన్ల నుంచి విశేష స్పందన లభిస్తోంది. బాలీవుడ్ దర్శకుడు నితేశ్ తివారీ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న ‘రామాయణ్’ చిత్ర అధికారిక ట్రైలర్ విడుదల కావడానికి కొద్ది రోజుల ముందే ఈ ఏఐ వీడియో వెలుగులోకి రావడం విశేషం.ఓ యూట్యూబ్ ఛానెల్ రూపొందించిన ఈ ట్రైలర్‌లో మహేశ్ బాబు (రాముడు), జూనియర్ ఎన్టీఆర్ (రావణుడు), కీర్తి సురేశ్ (సీత), జాన్వీ కపూర్ (మండోదరి)లను ఏఐ పరిజ్ఞానంతో అత్యంత సృజనాత్మకంగా ఆవిష్కరించారు. ముఖ్యంగా సీతాపహరణం సమయంలో రాముడి వేదనను, పరమ శివభక్తుడిగా రావణుడిని చూపించిన తీరు ప్రేక్షకు లను విశేషంగా ఆకట్టుకుంటోంది.వాస్తవానికి, నితేశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న ‘రామాయణ్’ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, కన్నడ స్టార్ యశ్ రావణుడిగా నటిస్తున్నారు. ఈ చిత్రంతోనే సాయి పల్లవి బాలీవుడ్ అరంగేట్రం చేస్తుండటం గమనార్హం. అలాగే హనుమంతుడిగా సన్నీ డియోల్, మండోదరిగా కాజల్ అగర్వాల్ ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, డీఎన్ఈజీ, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంస్థలు ఈ భారీ ప్రాజెక్టును సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.ఈ చిత్ర మొదటి భాగాన్ని 2026 దీపావళి కానుకగా విడుదల చేయనున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక ట్రైలర్‌ను జూలై 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు.